# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 175 | హైదరాబాద్ | బుధవారం 31-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

గగనతలంపై సుదర్శన చక్రం..శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం




11లో

## అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఖరారు

- అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని
- శాసనమండలి ఉపనేతలుగా ఎల్.రమణ
- మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు
- అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం

## చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా

- ఆక్రమణలకు అద్దం పడుతున్న హైడ్రా విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు
- ఇనార్బిట్ మాల్ వైపు కబ్జా కోరల్లో చిక్కుకున్న 5 ఎకరాల స్థలం స్వాధీనం
- మట్టితో పూడ్చి పార్కింగ్ పేరుతో నెలకు రూ.50 లక్షల దందా చేసిన వైనం
- 160 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు నేడు 116 ఎకరాలు

11లో






11లో

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్


- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణాలలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య...

- స్వెటర్స్ ఫ్యాక్టరీలో కాల్చి చంపిన తోటి ఉద్యోగి
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన బజేంద్ర



11లో



11లో

## తిరుమల తరహాలో గుట్ట ఆలయంలో ప్రత్యేక సేవలు

- గుట్ట క్షేత్రంలో భక్తుల కోసం పలు కొత్త సేవలు అందుబాటులోకి
- ప్రతి బుధవారం తోమాల సేవ
- సరికొత్తగా తులాభారం సేవ
- నేటి నుంచి ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ



11లో

## వైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాలు

- తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- శ్రీవారి దర్శనం అనంతరం సీఎంకి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించిన అర్చకులు

## వేల కోట్ల రోడ్ల బడ్జెట్ ఏమైపోతోంది..?



హైదరాబాద్ నగర రోడ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.. ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా పోతోంది.. రోడ్లమీదకు వచ్చి ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.. ఇంటినుంచి బయలుదేరిన వ్యక్తి తిరిగి ఇంటికి వస్తాడో రాడో తెలియని పరిస్థితి వుంది.. రాంగ్ రూట్ అని ఇంకేదో అంటూ వేలకు వేలు వసూలు చేస్తున్న అధికారులకు, గుంతలు పడి ప్రమాదకరంగా మారిన నగర రోడ్లు కనిపించడం లేదా..? శుష్క వాగ్ధానాలు చేస్తున్న నాయకుల కళ్ళు మూసుకుని పోయాయా..? ప్రజలు కట్టే పన్నులతో కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నా ఆ నిధులు ఏమైపోతున్నాయి..? ఎవరి బొక్కసాలు నిండుతున్నాయి..? గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. సి ఆర్ ఎం పీ పేరుతో రోడ్లను చీల్చి, ప్రజల ప్రాణాలు తీస్తున్నారా? ఏమిటీ వైపరీత్యం..?

12లో

# కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ల కయ్యాలు...

బెంగళూరు శివారు ప్రాంతమైన యలహంకలో ఇటీవల జరిగిన ఇళ్ల కూల్చివేత ఘటన ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ చిచ్చును రేపింది. కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేరళ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. ఒక పక్క ఇండియా కూటమిలో మిత్రపక్షాలుగా ఉన్నప్పటికీ, ఈ రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. అసలు యలహంకలో ఏం జరిగింది? కేరళ సీఎం ఈ అంశాన్ని ఎందుకు హైలైట్ చేస్తున్నారు? ఇది కేవలం మానవతా దృక్పథంతో చేసిన వ్యాఖ్యలేనా లేక రాబోయే కేరళ ఎన్నికల కోసం వేస్తున్న రాజకీయ ఎత్తుగడా? అన్న కోణంలో అనేక ఊహాగానాలు సాగుతున్నాయి.బెంగళూరు నగర శివారులోని యలహంక పరిధిలో ఉన్న ఓ కాలనీలో దాదాపు 300 నుంచి 400 ఇళ్లను కర్నాటక అధికారులు ఈ నెల 20న నేలమట్టం చేశారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో అత్యధికులు నిరుపేద ముస్లింలు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే, బుల్డోజర్లతో తమ ఇళ్లను కూల్చేశారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే, ఆక్రమణల తొలగింపు పేరుతోనే ఈ చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఒకేసారి వందల ఇళ్లను కూల్చివేయడం, బాధితులకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్ న్యాయం పేరుతో జరిగిన కూల్చివేతలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ, ఇప్పుడు సొంత పాలనలో ఉన్న కర్నాటకలో అదే తరహా ఘటన జరగడం కాంగ్రెస్ కు ఇబ్బందికరంగా మారింది. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెంటనే స్పందించారు. కర్నాటక ప్రభుత్వం తీరును తప్పుబడుతూ, కాంగ్రెస్ పార్టీ కూడా సంఘ్ పరివార్ బాటలోనే నడుస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. "ముస్లింల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం బీజేపీ విధానం అయితే, కాంగ్రెస్ కూడా అదే సంస్కృతిని అనుసరిస్తోంది" అని ఆయన ఆరోపించారు. లౌకికవాదం గురించి మాట్లాడే కాంగ్రెస్, చేతల్లో మాత్రం హిందుత్వ ఎజెండాను అమలు చేస్తోందనేది పినరయి ప్రధాన ఆరోపణ.దీనికి కర్నాటక ప్రభుత్వం కూడా అంతే దీటుగా బదులిచ్చింది. కేరళ సీఎం తమ రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, బాధితులకు తాము అండగా ఉంటామని, ఇళు కట్టిస్తామని కర్నాటక మంత్రులు కౌంటర్ ఇచ్చారు.పినరయి విజయన్ వ్యాఖ్యలను కేవలం పొరుగు రాష్ట్రంలో జరిగిన అన్యాయంపై స్పందనగా మాత్రమే చూడలేమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు, రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలు దాగి ఉన్నాయని చెప్పున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఎం కలిసే ఉన్నా, కేరళలో మాత్రం ఈ రెండు పార్టీలే ప్రధాన ప్రత్యర్థులు. అక్కడ బీజేపీ ప్రభావం తక్కువ కాబట్టి, అధికారం ఎప్పుడూ ఎల్డీఎఫ్ (లెఫ్ట్) లేదా యూడీఎఫ్ (కాంగ్రెస్) చేతుల్లోనే మారుతుంటుంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ను దెబ్బకొట్టాలంటే, ఆ పార్టీని సాఫ్ట్ హిందుత్వ పార్టీగా ముద్ర వేయడం కమ్యూనిస్టులకు అవసరం. కేరళ రాజకీయాల్లో ముస్లిం ఓటు బ్యాంక్ చాలా కీలకం. సంప్రదాయబద్ధంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ద్వారా ముస్లిం ఓట్లు కాంగ్రెస్ కూటమి వైపు ఉంటాయి. ఆ ఓటు బ్యాంకును చీల్చడమే పినరయి లక్ష్యం. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ఇళ్లు కూల్చేస్తోందని చెప్పడం ద్వారా, కేరళలోని ముస్లింలకు కాంగ్రెస్ ను నమ్మవద్దనే సంకేతాన్ని పంపాలని ఎల్డీఎఫ్ భావిస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీకి కాంగ్రెస్ సరైన ప్రత్యామ్నాయం కాదని, ఆ పార్టీ కూడా బీజేపీ సిద్ధాంతాలనే పరోక్షంగా అమలు చేస్తోందని చెప్పడం ద్వారా, కమ్యూనిస్టులు తమ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. యలహంక ఘటన వారికి ఒక అద్భుతమైన రాజకీయ ఆయుధంగా దొరికింది. ఈ పరిణామం జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలోని డొల్లతనాన్ని కూడా బయటపెడుతోంది. ఢిల్లీలో చేతులు కలిపే నేతలు, రాష్ట్రాల స్థాయిలో మాత్రం ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. వాయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీకి సీపీఎం మద్దతు ఇవ్వకపోవడం, ఇప్పుడు పినరయి విమర్శలు.. ఇవన్నీ భవిష్యత్తులో కూటమి ఐక్యతపై సందేహాలను లేవనెత్తుతున్నాయి.మొత్తానికి, బెంగళూరులో జరిగిన ఒక స్థానిక పాలనాపరమైన తప్పిదం, పక్క రాష్ట్రమైన కేరళలో అతిపెద్ద రాజకీయ అస్త్రంగా మారింది. కర్నాటక ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసి, ఇళ్లు కట్టిస్తామని నష్ట నివారణ చర్యలు చేపట్టినప్పటికీ, పినరయి విజయన్ లేవనెత్తిన కాంగ్రెస్, సంఘ్ పరివార్ ఒక్కటే అనే నినాదం కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఇరకాటంలో పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బుల్డోజర్ రాజకీయాలు కేవలం ఇళ్లను కూల్చడమే కాదు, రెండు మిత్రపక్షాల మధ్య సంబంధాలను కూడా కూల్చేస్తున్నాయి అనడంలో సందేహం లేదు

# 100 పర్సెంట్ కనెక్టివిటీ దిశగా అడుగులు

విశాఖపట్టణం, డిసెంబర్ 30,(భారత శక్తి):

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో మొబైల్ కనెక్టివిటీపై ఫోకస్ పెట్టింది. మొబైల్ సిగ్నల్స్‌ను మెరుగుపరిచేందుకు సిద్ధమైంది.. మారుమూల ప్రాంతాల్లో కూడా సిగ్నల్స్ వచ్చేలా ప్లాన్ చేస్తోంది. దీని కోసం కొత్తగా 707 టవర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను గుర్తించి ఈ టవర్లు ఏర్పాటు చేస్తారు. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద ఈ వ్యాయాన్ని కేంద్రం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ టవర్లకు అవసరమైన స్థలాన్ని ఇస్తుంది.ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. కొత్తగా 707 సెల్ టవర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ సెల్ టవర్ల నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ భారత్ నిధి' పథకం ద్వారా భరిస్తుంది. అయితే, టవర్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఈ టవర్లను ఏర్పాటు చేస్తాయి. రాష్ట్రంలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. సెల్ ఫోన్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో, ఉన్న టవర్లు సరిపోవడం లేదు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో, అలాగే తరచుగా సిగ్నల్ సమస్యలు వచ్చే చోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రభుత్వం కొత్తగా టవర్లు నిర్మించాలని ఆలోచిస్తోంది. కొత్త టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ భూములు కూడా అవసరం అవుతాయి. కొన్ని చోట్ల టవర్ల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రిని తరలించడానికి సరైన రోడ్డు మార్గాలు కూడా లేవని అధికారులు గుర్తించారు. ఇది నిర్మాణ పనులకు అడ్డంకిగా మారుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలోని చాలా గిరిజన గ్రామాల్లో సెల్ ఫోన్ నెట్‌వర్క్ సరిగా పనిచేయడం లేదు. ఈ ఒక్క జిల్లాలోనే 100 కొత్త టవర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలో భాగంగా, అధికారులు ఇప్పటికే 42 ప్రదేశాలలో జాయింట్ సర్వేను పూర్తి చేశారు. మరో 13 స్థలాలను టవర్ల ఏర్పాటు కోసం సంబంధిత టెలికాం సంస్థలకు అప్పగించారు. ఈ చర్యల ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సదుపాయం



అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నారు.రాష్ట్రంలో నెట్‌వర్క్ వాడకం బాగా పెరిగిపోయింది. దీంతో తరచూ సిగ్నల్ సమస్యలు వస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. టవర్లు అందరికీ సరిపోవట్లేదు.. అందుకే, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి ముందుకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 4జీ సేవలను మెరుగుపరచడానికి 624 కొత్త టవర్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసింది. ఈ కొత్త టవర్లను ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు పరిశీలించారు. కొత్త జిల్లాల ఆధారంగా స్థలాలను గుర్తించారు. ఇప్పటికే 295 ప్రాంతాల్లో సర్వేలు పూర్తయ్యాయి. ఈ సర్వేల ఆధారంగా, 37 లొకేషన్లను టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ చర్యల వల్ల రాష్ట్రంలో సిగ్నల్ సమస్యలు తగ్గుతాయని ఆశిస్తున్నారు.

# వైసీపీకి ప్రాణసంకటంగా పీపీపీ

విజయవాడ, డిసెంబర్ 30, (భారత శక్తి):

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలల నిర్వహణపై పీపీపీ విధానం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రైవేటీకరణ గా అభివర్ణిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటరీ కమిటీల నుంచి ఈ విధానానికి లభిస్తున్న మద్దతు



వైసీపీని ఇరకాటంలోకి నెట్టింది.ఏపీలో పది కొత్త మెడికల్ కాలేజీల నిర్వహణకు పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. ఇప్పటికే కోటి సంతకాల సేకరణతో ప్రజల్లోకి వెళ్లిన వైసీపీ, ఇది పేదల వైద్యానికి తీరని ద్రోహమని ఆరోపిస్తోంది. అయితే, ఈ పోరాటంలో ఆ పార్టీకి ఇప్పుడు స్వంత ఎంపీల నుంచి, అటు కేంద్రం నుంచి అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. వైద్య విద్యలో పీపీపీ విధానం మేలని పార్లమెంటరీ స్థాయి సంఘం స్పష్టమైన సిఫార్సులు చేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కమిటీలో వైసీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సభ్యుడిగా ఉన్నారు. ఈ అంశంపై టీడీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టిన గురుమూర్తి.. తాము పీపీపీని కేవలం కొత్త ప్రాజెక్టులకే సూచించామని, ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని వివరణ ఇచ్చారు. అయితే, కమిటీ నివేదికపై సంతకం చేసిన తర్వాత ఇప్పుడు బయట వ్యతిరేకించడం రాజకీయంగా వైసీపీకి కొంత ఇబ్బందికరంగా మారిందిపీపీపీ విధానాన్ని ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తున్న వైసీపీకి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రభుత్వానికి రాసిన లేఖ రూపంలో పరోక్షంగా గట్టి కౌంటర్ ఇచ్చారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, ఇది మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన సమర్థించారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టులకు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద 30 నుంచి 40 శాతం వరకు మూలధన సబ్సిడీని కేంద్రం అందిస్తుందని, నిర్వహణ వ్యయంలోనూ 25 శాతం భరిస్తామని ఏపీ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వైసీపీ చేస్తున్న అవినీతి ఆరోపణలు తేలిపోయినట్లయింది. ఇప్పుడు పీపీపీ విధానాన్ని వైసీపీ వ్యతిరేకిస్తే బీజేపీపైనా ఆరోపణలు చేసినట్లే. కేంద్రంపై కూడా యుద్ధం చేసినట్లే. ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సఖ్యతగా ఉంటూ, రాష్ట్రంలో మాత్రం అదే బీజేపీ మద్దతు ఇస్తున్న విధానాలను వ్యతిరేకించడం వైసీపీకి సవాలుగా మారింది. ఇప్పటికి ఇప్పుడు బీజేపీని వ్యతిరేకిస్తూ వైసీపీ ఉద్యమాలు చేసే పరిస్థితుల్లో లేదు. అందుకే ఈ నిందను కేవలం చంద్రబాబుపైకి నెట్టేందుకే వైసీపీ మొగ్గు చూపుతోంది. అయితే ఇప్పుడు వెనక్కి తగ్గితే వైసీపీ పోరాటం నవ్వుల పాలవుతుంది. అందుకే పీపీపీ విధానం ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందదని, మెనేజ్మెంట్ కోటా సీట్లను రూ. 60 లక్షల వరకు అమ్ముకుంటారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఇప్పటికే గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన వైసీపీ, అవసరమైతే కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. మొత్తం మీద, ఒకవైపు కేంద్రం నుంచి 40% సబ్సిడీ హామీ , పార్లమెంటరీ కమిటీ క్లీన్ చిట్ ఉండటంతో, వైసీపీ చేస్తున్న ప్రైవేటీకరణ ప్రచారం క్షేత్రస్థాయిలో తేలిపోతోందన్న భావన వ్యక్తమవుతోంది.

# సాలూరుకు ట్రైన్ కల తీరినట్టేనా

విజయనగరం, డిసెంబర్ 30, (భారత శక్తి):

ఉత్తరాంధ్ర ప్రాంతానికి రైలు కనెక్టివిటీ ఉంది.. కానీ ఆ చిన్న పట్టణానికి మాత్రం రైల్వే స్టేషన్ ఉన్నా ప్రజలు రైలు కోసం ఎదురు చూస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు రైల్వే స్టేషన్‌కు రైలు నడిపేందుకు ట్రయల్ రన్ నిర్వహించి ఏడాది దాటినా.. ఇప్పటి వరకు రైలు సేవలు ప్రారంభం కాలేదు. కరోనా సమయంలో నిలిపివేసిన రైలు బస్సును కూడా పునరుద్ధరించలేదు.. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.గతంలో సాలూరు, బొబ్బిలి పట్టణాల మధ్య రైలు బస్సు సేవలు అందుబాటులో ఉండేవి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఉండే ఈ సేవలు కూలీలకు, పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేవి. విద్యార్థులు కూడా బొబ్బిలికి వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించేవారు. సాలూరు, బొబ్బిలి ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరం ప్రాంతాలకు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. అయితే, కరోనా కాలం నుంచి ఈ రైలుబస్సు సేవలను పూర్తిగా నిలిపివేశారురైలు బస్సు సేవలు నిలిచిపోవడంతో, ఈ రెండు పట్టణాల మధ్య ఉన్న అనేక గ్రామాల ప్రజలు విశాఖ, విజయనగరం వంటి నగరాలకు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా, సాలూరు-బొబ్బిలి రైలుబస్సు సేవలు పునరుద్ధరించబడలేదు. ఈ నేపథ్యంలో, రైలుబస్సు సేవలను తిరిగి ప్రారంభించాలని ప్రజలు రైల్వే అధికారులను, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ సేవలను పునరుద్ధరిస్తే, ఎంతో మంది ప్రయాణికులకు ఉపశమనం లభిస్తుంది.సాలూరు నుంచి రాయగడ, విశాఖపట్నం




వరకు రైలు నడపాలని 2018లో స్థానికులు కోరడంతో రైల్వే అధికారులు స్పందించారు. స్టేషన్ అభివృద్ధి, రోడ్డు పనులు, షెల్టర్ ఏర్పాటు, విద్యుత్ లైన్ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. గతేడాది అక్టోబరులో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినా, ఏడాది గడిచినా రైలు సేవలు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2018లో సాలూరుకు వారు రైలు కోసం రిక్వెస్ట్ చేశారు. సాలూరు నుంచి రాయగడ, విశాఖపట్నం వరకు రైలు నడపాలని వారు కోరారు.

వారి అభ్యర్థన మేరకు, అప్పటి డీఆర్ఎం సాలూరు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ అభివృద్ధి, దండిగాం రోడ్డు, కొత్త షెల్టర్ ఏర్పాటు, విద్యుత్ లైన్ పనుల కోసం నిధులు మంజూరు చేశారు. ఈ పనులన్నీ పూర్తయ్యాయి. గత ఏడాది అక్టోబరు మొదటి వారంలో విశాఖపట్నం నుంచి సాలూరు రైల్వే స్టేషన్‌కు ఒక రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ రైలు కూత విని పట్టణ ప్రజలు ఎంతో సంతోషించారు. పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయితే, ట్రయల్ రన్ పూర్తయి సంవత్సరం దాటినా, రైలు సేవలు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి.

# వైసీపీ అంటే అంతే...విరాళాల జోరు

కడప, డిసెంబర్ 30, (భారత శక్తి):

రాజకీయాల్లో అధికారం ఎక్కడ ఉంటే అక్కడ నిధుల ప్రవాహం ఉండటం సహజం. కార్పొరేట్ సంస్థలైనా, వ్యక్తిగత దాతలైనా అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతుంటారు. కానీ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రంలో ఈ సహజ సూత్రం తలకిందులైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఘోర పరాజయాన్ని చవిచూసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, విరాళాల సేకరణలో మాత్రం అధికార కూటమికి అందనంత ఎత్తులో నిలిచింది. ఎన్నికల సంఘానికి సమర్పించిన 2024-25 వార్షిక నివేదిక గణాంకాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.2024 ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితమై, ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోలేకపోయింది. పార్టీ పని అయిపోయిందంటూ విశ్లేషణలు వెలువడ్డాయి. కానీ, ఆర్థికంగా ఆ పార్టీకి ఉన్న బలం ఏమాత్రం తగ్గలేదని తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వైసీపీకి ఏకంగా రూ.140.03 కోట్ల విరాళాలు వచ్చాయి. మరోవైపు, అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీకి ఈ కాలంలో వచ్చిన విరాళాలు రూ.83 కోట్లు మాత్రమే. ఇక కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీకి రూ.25.33 కోట్లు సమకూరాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన రెండు పార్టీల విరాళాల మొత్తం రూ.108 కోట్లు కలిపినా, ఒక్క వైసీపీకి వచ్చిన విరాళాల కంటే తక్కువే కావడం గమనార్హం.సాధారణంగా ఎన్నికల సంవత్సరం లేదా అధికారం మారిన కొత్తలో పాలక పక్షానికి విరాళాలు వెల్లువలా వస్తాయి. కానీ, టీడీపీ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. 2023-24తో పోల్చితే, టీడీపీ అధికారంలోకి వచ్చిన 2024-25లో ఆ పార్టీకి వచ్చిన విరాళాలు తగ్గడం విస్మయం కలిగిస్తోంది. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ అంటే జూన్ 2024 చాలా మంది దాతలు తటస్థంగా ఉండటం లేదా అప్పటికే అధికారంలో ఉన్న వైసీపీ గెలుస్తుందనే అంచనాతో ఆ పార్టీకే నిధులు మళ్లించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ గణాంకాలు కేవలం ఎన్నికల తర్వాత వచ్చినవే కాకుండా, ఎన్నికల ముందు ఏప్రిల్-మే 2024 సమయంలో ఇచ్చినవి కూడా కలిపి ఉంటాయని గమనించాలి.విరాళాల విషయంలో తమకు లభించిన ఆధిక్యాన్ని వైసీపీ ఒక నైతిక విజయంగా చెప్పుకుంటోంది. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, తమ పార్టీపై ప్రజలకు, పారిశ్రామికవర్గాలకు, అభిమానులకు నమ్మకం సడలలేదని ఈ నిధులే నిదర్శనమని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వచ్చిన ఈ విరాళాలు, క్యాడర్ లో జోష్ నింపడానికి ఉపయోగపడుతున్నాయి. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేయడానికి, న్యాయపరమైన పోరాటాలకు, సంస్థాగత నిర్మాణం కోసం ఈ నిధులు ఉపయోగపడతాయని వారు భావిస్తున్నారు.

# పాపం.. ప్రవీణ్ ప్రకాష్...

అమరావతి, డిసెంబర్ 30, (భారత శక్తి):

ఏపీ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న తర్వాత, తిరిగి సర్వీసులోకి రావాలని కోరుకుంటూ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఒకప్పుడు చక్రం తిప్పిన ఈ అధికారి, ఇప్పుడు తన నిర్ణయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మీడియా ముందు వాపోవడానికి కారణం పోస్టింగ్ కోసమేనని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అత్యంత శక్తివంతమైన అధికారిగా వెలుగొందిన ప్రవీణ్ ప్రకాష్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారు. తన లేఖను సచివాలయం పోస్ట్ బాక్స్‌లో వేసి వెళ్ళిపోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆరేళ్ల సర్వీసు ఉండగానే తీసుకున్న ఈ నిర్ణయం తప్పని ఆయనకు ఏడాదిన్నర తిరగకముందే అర్థమైనట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన వివిధ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, తాను చేసిన తప్పులను ఒప్పుకోవడం, క్షమాపణలు కోరడం చూస్తుంటే.. ఆయనకు మళ్లీ ఐఏఎస్ హోదా కావాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది.నిబంధనల ప్రకారం, ఒక ఐఏఎస్ అధికారి సమర్పించిన విఆర్ఎస్ దరఖాస్తును ప్రభుత్వం ఆమోదించి, సదరు అధికారి రిలీవ్ అయిన తర్వాత దానిని వెనక్కి తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. సాధారణంగా విఆర్ఎస్ అమల్లోకి రాకముందే దానిని ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకసారి ప్రభుత్వం రాజీనామాను లేదా విఆర్ఎస్‌ను ఆమోదించిన తర్వాత, దానిని రద్దు చేసి తిరిగి సర్వీసులోకి తీసుకోవడం అనేది అరుదుగా, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే జరుగుతుంది. దీనికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అనుమతితో పాటు రాష్ట్ర ప్రభుత్వ బలమైన సిఫార్సు అవసరం.ప్రవీణ్ ప్రకాష్ సర్వీసులో ఉన్నప్పుడు తన తోటి ఐఏఎస్ అధికారులతో ప్రవర్తించిన తీరు ఇప్పుడు ఆయనకు పెద్ద శాపంగా మారింది. గత ప్రభుత్వంలో ఆయన అతి వల్ల ఇబ్బందులు పడ్డ అధికారులు, అవమానాలకు గురైన వారు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ వల్ల ఇబ్బందులకు గురైన సహచర అధికారులు, ఆయనను మళ్లీ వ్యవస్థలోకి రానివ్వడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఒక అధికారిపై ఇతర అధికారులందరిలోనూ ఇంత వ్యతిరేకత ఉండటం ఆయన పునరాగమనానికి ప్రధాన అడ్డంకిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణంగా అధికారుల పట్ల కక్షసాధింపు ధోరణితో ఉండరు. గతంలో చంద్రబాబుకు ప్రవీణ్ ప్రకాష్ సన్నిహితంగా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, గత ఐదేళ్లలో ఆయన వ్యవహరించిన తీరు, వ్యవస్థలను ప్రభావితం చేసిన విధానం చంద్రబాబుకు కూడా తెలుసు. ఇప్పుడు ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను మళ్లీ చేరదీస్తే అది ఇతర అధికారులకు తప్పుడు సంకేతాలు పంపుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతానికి ప్రవీణ్ ప్రకాష్ చేస్తున్న ప్రయత్నాలు అరణ్య రోదనగానే కనిపిస్తున్నాయి. ఒక అధికారిగా ఆరేళ్ల సర్వీసును వదులుకుని బయటకు వచ్చిన తర్వాత, ఇప్పుడు మీడియా వేదికగా తన బాధను చెప్పుకోవడం వల్ల సానుభూతి కంటే విమర్శలే ఎక్కువగా వస్తున్నాయి. ప్రభుత్వం ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకునే అవకాశాలు దాదాపు శూన్యమని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. అటు నిబంధనలు సహకరించకపోవడం, ఇటు రాజకీయంగానూ, అధికారికంగానూ మద్దతు లేకపోవడంతో ప్రవీణ్ ప్రకాష్ వీఆర్ఎస్ అధికారి హోదాలోనే మిగిలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.



ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు ఇప్పటివరకు రైలు ఎప్పుడు వస్తుందనే దానిపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బొబ్బిలి, పార్వతీపురం రైల్వే స్టేషన్‌లను సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులు, మే నెలలో సాలూరుకు రైలు వస్తుందని చెప్పారు. కానీ, ఆ మాట కూడా తప్పింది. ఏడాది పూర్తవుతున్నా రైలు సేవలు పునరుద్ధరించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, కేంద్రం స్పందించి రైలును నడపాలంటున్నారు. తమ ప్రయాణ అవసరాలు తీర్చే రైలు సేవలను త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

# హైస్పీడ్ కనెక్టివిటీతో ట్రాఫిక్ ఫ్రీ ట్రంక్ రోడ్లు

అమరావతి, డిసెంబర్ 30, (భారత శక్తి):

ఆధునిక సౌకర్యాలతో ప్రధాన రహదారుల నిర్మాణం వేగవంతమైంది. హైస్పీడ్ కనెక్టివిటీ లక్ష్యంగా, 50-60 మీటర్ల వెడల్పుతో ఆర్టీరియల్ రహదారులను నిర్మిస్తున్నారు. ఈ-11, ఈ-13, ఈ-15 రహదారులను జాతీయ రహదారి 16తో అనుసంధానం చేస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3) నిర్మాణం, వరద నీటి నియంత్రణ వ్యవస్థ, తాగునీటి పైపులు, డ్రైనేజీ, విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రధాన రహదారుల నిర్మాణం వేగవంతమైంది. రాబోయే వందేళ్ల అవసరాలకు తగ్గట్టుగా.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా విశాలంగా, ఆధునిక సౌకర్యాలతో ఈ రోడ్లను నిర్మిస్తున్నారు. హైస్పీడ్ కనెక్టివిటీతో పాటుగా అందించడమే లక్ష్యంగా ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా ఉండేందుకు 50 నుంచి 60 మీటర్ల వెడల్పుతో ఆర్టీరియల్ రహదారులను నిర్మిస్తున్నారు. ఆర్టీరియల్ రహదారులు అంటే నగరంలో ముఖ్యమైన ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారులు. భవిష్యత్తులో వచ్చే ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేపడుతున్నారు. రోడ్లు చాలా విశాలంగా, అన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు.అమరావతిలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి అనేక రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఈ-11, ఈ-13, ఈ-15 రహదారులను జాతీయ రహదారి 16తో అనుసంధానం చేస్తున్నారు. అమరావతికి సులభంగా చేరుకోవడానికి, 9 వరుసలతో కూడిన సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ-3)ను నిర్మిస్తున్నారు. ఈ రహదారుల కింద వరద నీటిని అదుపు చేసే వ్యవస్థ, తాగు నీటి పైపులు, డ్రైనేజీ, విద్యుత్తు లైన్లు, ఇంటర్‌నెట్ కేబుల్స్ వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులన్నీ చాలా వేగంగా జరుగుతున్నాయి. ఎన్-7 రహదారిపై ఒక వంతెన నిర్మాణం కూడా జరుగుతోంది. అనంతవరం అనే ప్రాంతం దగ్గర ఈ-5 రోడ్డు నిర్మాణం కూడా వేగంగా పురోగమిస్తోంది. ఈ-3 రోడ్డును ప్రకాశం బ్యారేజ్ దగ్గర మంగళగిరి రోడ్డుతో కలపాలని ఏడీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పనులను 2026 ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని అనుకుంటున్నారు. దీని కోసం తాడేపల్లి దగ్గర ఒక స్టీల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు.ఏడాదిలో ప్రధాన రహదారులన్నీ ఒక రూపు సంతరించుకుంటాయి. ప్రస్తుతం ట్రంక్ రోడ్లు నిర్మాణాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ట్రంక్ రోడ్లు అంటే ప్రధానమైన, ఎక్కువ రద్దీ ఉండే రహదారులు. ఈ రహదారుల నిర్మాణంతో పాటు, వాటి కింద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు' అని ఏడీసీఎల్ సీఈ తెలిపారు.

# పవన్ బాటలో విజయ్...


చెన్నై, డిసెంబర్ 30,(భారత శక్తి):

: రాజకీయాలలో నాయకులందరూ హామీలు ఇస్తుంటారు. అందరి సమక్షంలో గొప్ప గొప్ప మాటలు చెబుతుంటారు. కానీ వీటి మీద నిలబడే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. ఇక చిత్ర సీమ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా మొదట్లో గొప్ప గొప్ప మాటలు చెప్పారు. ఆ మాటలు మీద నిలబడిన వారు దాదాపు లేరని చెప్పుకోవాలి.తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారు చాలామంది ఉన్నారు. అయితే ఆ రాజకీయాలలో స్థిరంగా నిలబడిన వారు కొంతమంది మాత్రమే. అంతటి మెగాస్టార్ చిరంజీవి కూడా రాజకీయాలకు వచ్చినప్పుడు మళ్ళీ సినిమాలు చేయనని చెప్పారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన తర్వాత ఆయన మళ్లీ సినిమాలు చేయడం మొదలుపెట్టారు. జనసేన పార్టీ స్థాపించిన పవన్ కళ్యాణ్ కూడా అజ్ఞాతవాసి సినిమా తర్వాత సినిమాలు చేయబోనని స్పష్టం చేశారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆయన తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. వకీల్ సాబ్, బ్రో, భీమ్లా నాయక్, హరిహర వీరమల్లు, ఓజి ఇలా ఐదు సినిమాలలో ఆయన నటించారు. చిరంజీవి కూడా ఖైదీ నెంబర్ 150, సైరా నరసింహారెడ్డి, గాడ్ ఫాదర్, ఆచార్య, బోలా శంకర్ వంటి సినిమాలలో నటించారు.



ఇప్పుడు మన శంకర వరప్రసాద్ గారు పండక్కి వచ్చేస్తున్నారు.. అనే సినిమాలో నటిస్తున్నారు.తమిళ చిత్ర పరిశ్రమలో కూడా రాజకీయాల్లోకి వచ్చిన వారు.. వస్తున్న వారు కూడా చాలా మంది ఉన్నారు. ఇటీవల విజయ్ రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు.. అంతేకాదు తాను నటిస్తున్న జననాయగన్ సినిమా చివరిదని ప్రకటించారు. ఆయన చేసిన ఆ ప్రకటన అభిమానులను ఆవేదనకు గురిచేస్తుంది. కెరియర్ పీక్లో ఉండగానే ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల తమిళ్ చిత్ర పరిశ్రమలో చర్చ మొదలైంది. విజయ్ రాజకీయాల్లో ఉండాలని.. అదే సమయంలో సినిమాల్లో కూడా నటించాలని అభిమానులు కోరుతున్నారు. అయితే ప్రస్తుతం తమిళ్ రాజకీయ పరిస్థితులను చూస్తే విజయ్ కోరుకున్నట్టుగానే ఫలితాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే తమిళ రాజకీయాలలో బలమైన ప్రతిపక్షం ఇప్పుడు లేదు. ఒకవేళ ఆ స్థానాన్ని విజయ్ ఆక్రమిస్తే అప్పుడు ఆయన సినిమాల్లో నటించే అవకాశం ఉండదు. ఒకవేళ అధికారాన్ని గనుక దక్కించుకుంటే అప్పుడు ఆ మాత్రం తీరిక కూడా ఆయనకు ఉండదు. ఒకవేళ ప్రతిపక్షానికి దూరమై.. మామూలు పార్టీగానే మిగిలిపోతే అప్పుడు.. సినిమాల్లోకి కచ్చితంగా రావాల్సి ఉంటుంది. అప్పుడు విజయ్ తన మాటను వెనక్కి తీసుకోవాల్సి ఉంటుంది. అది ఒక రకంగా ఆయన అభిమానులకు మంచి వార్త అయినప్పటికీ.. మిగతా వారికి మాత్రం కచ్చితంగా ఆయుధం అవుతుంది.

# దేశంలో 880 టన్నుల బంగారం



ముంబై, డిసెంబర్ 30 (భారత శక్తి):

మన దేశంలో బంగారానికి ఎంత డిమాండ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చైనా తర్వాత ఎక్కువగా బంగారాన్ని వినియోగించే దేశంగా భారత్ ఉంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం దేశ ప్రజల వద్ద ఉన్న బంగారం విలువ.. ఏకంగా దేశ జీడీపీనే మించిపోయిందని తెలుస్తోంది. ప్రజల వద్దే కాకుండా ఇంకా రిజర్వ్ బ్యాంక్ దగ్గర కూడా బంగారం నిల్వలు విశేషంగా ఉన్నాయని చెప్పొచ్చు. ఇదంతా కలిపితే ఇంకా ఎక్కువే ఉంటుందిబంగారానికి.. భారతీయులకు విడదీయరాని సంబంధం ఉంది. పురాతన కాలం నుంచి భారతీయులకు బంగారం అంటే అమితమైన ఆసక్తి. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాల్ని విశేషంగా కొనుగోలు చేసి ధరిస్తుంటారు. పండగలు, శుభకార్యాలు, వివాహాలు ఇతర ప్రత్యేక సందర్భాల సమయంలో డిమాండ్ మరింత ఎక్కువగా ఉంటుంది. బంగారు ఆభరణాలు మహిళల అందాన్ని మరింత పెంచుతుందని చెబుతుంటారు. సమాజంలో హోదాను కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే.. ప్రతి ఇంట్లో ఎంతో కొంత బంగారం ఉంటుంది. అనిశ్చితి, సంక్షోభాల వేళ బంగారం సురక్షితమైన పెట్టుబడి సాధనంగా పనిచేస్తుందని నమ్ముతారు. అందుకే.. తమ దగ్గర ఉన్న డబ్బుతో చిన్న చిన్న మొత్తాల్లో కూడా కొనుగోలు చేసి కూడబెడుతుంటారు. అయితే ఇప్పుడు భారతీయుల వద్ద ఉన్న బంగారం విలువ .. సరికొత్త మైలురాయిని తాకింది.ప్రజల వద్ద ఉన్న మొత్తం బంగారం విలువ.. ఇప్పుడు భారత స్థూల దేశీయోత్పత్తినే మించిందని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల ఇంట్లో ఉన్న బంగారం విలువ కూడా విపరీతంగా పెరిగిందని చెప్పొచ్చు. భారతీయ ప్రజల వద్ద సుమారుగా 34 వేల నుంచి 35 వేల టన్నుల వరకు బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా.ఇంటర్నేషనల్ మార్కెట్లో కిలో బంగారం ధర 1,46,000 డాలర్ల మార్కు దాటింది. ఇదే టన్నుకు (1000 కిలోలు) చూస్తే దీని విలువ 14,60,00,000 డాలర్లకు చేరుకుంది. 34,500 టన్నుల బంగారం ధర చూసినా ఇది సుమారు 5 ట్రిలియన్ డాలర్ల మార్కును అధిగమించింది. ట్రిలియన్ అంటే లక్ష కోట్లు. అంటే ప్రజల వద్ద బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్ల మార్కు దాటేసింది. ఇది భారత కరెన్సీలో చూస్తే సుమారు రూ. 450 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇక మన దేశ జీడీపీ 4 ట్రిలియన్ డాలర్లుగా ఉందని అంచనా. ఇది దాదాపు రూ. 360 లక్షల కోట్ల వరకు ఉంటుందని చెప్పొచ్చు. అంటే.. జీడీపీ కంటే భారత ప్రజల దగ్గర ఉన్న బంగారం విలువ దాదాపు 1.25 రెట్లు ఎక్కువగా ఉంది. ఈ అక్టోబర్ నెలలో భారతదేశ జీడీపీలో భారతీయుల దగ్గర ఉన్న బంగారం విలువ 88.8 శాతంగా ఉండగా.. ఇటీవల బంగారం రేట్లు విపరీతంగా పెరగ్గా ఇప్పుడు జీడీపీనే మించిపోయిందని చెబుతున్నారు. భారత్ తమ అవసరాల కోసం, ప్రజల డిమాండ్‌కు తగ్గట్లుగా అందుబాటులో ఉంచేందుకు ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటుందని చెప్పొచ్చు. ఇంకా బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాల్లో చైనా తర్వాత రెండో స్థానంలో ఉంది ఇండియా. ప్రజల దగ్గర మాత్రమే కాకుండా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర కూడా సుమారు 880 టన్నుల మేర పసిడి నిల్వలు ఉన్నాయి.

# చైనా, జపాన్ మధ్య యుద్ధ మేఘాలు

టోక్యో, డిసెంబర్ 30,(భారత శక్తి):

రత్?పాకిస్తాన్ తరహాలో చైనా?జపాన్ మధ్య తరచూ ఉద్రిక్తతలు కొనసాగుతాయి. తైవాన్‌కు అమెరికా, జపాన్ అండగా ఉంటున్నాయి. ఇది చైనాకు నచ్చడం లేదు. తమ పొరుగు దేశం తమ చెప్పుచేతల్లో ఉండాలని చూనా భావిస్తోంది. కానీ, తైవాన్ చిన్న దేశమే అయినా చైనాను ఢీకొట్టేందుకు రెడీ అంటోంది. తాజాగా జపాన్ ప్రధాని చేసిన వ్యాఖ్యలు మరోమారు చైనా?తావాన్ మధ్య ఉద్రిక్తతలు పెంచాయి. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి తైవాన్ భద్రతకు ముప్పు ఉంటే జపాన్ సైన్యం ప్రవేశిస్తుందని ప్రకటించారు. ఈ ప్రకటన ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత ఊపందుకునేలా చేసింది. జపాన్ స్వర్ణరేఖల ద్వీపాల సమీపంలో తన సైనిక బలగాలను బలోపేతం చేస్తోందని సమాచారం. అమెరికాతో డిఫెన్స్ ఒప్పందాల ఆధారంగా ఈ చర్యలు జరుగుతున్నాయి.చైనా పీఎల్ఏ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సీనియర్ కర్నల్ షి యీ నేతృత్వంలో 'జస్టిస్ మిషన్ 2025' అభ్యాసాలు తైవాన్ జలసరిరాల్లో ప్రారంభమవుతాయి. సముద్ర, ఆకాశ, భూమి దళాల సమన్వయంతో బ్లాకేడ్‌లు, ఆక్రమణ దాడులు, రాకెట్ లాంచ్‌లు పరీక్షిస్తారు. 100కి పైగా యుద్ధనౌకలు, 50 ఫైటర్ జెట్‌లు, డ్రోన్‌లు పాల్గొంటాయని అధికారికులు తెలిపారు. తైవాన్ విభజనవాదులకు ఈ కార్యక్రమాలు తీవ్ర హెచ్చరికగా పనిచేస్తాయని, జాతీయ భద్రతా లక్ష్యాలను సాధించడమే లక్ష్యమని బీజింగ్ స్పష్టం చేసింది. ఇప్పటికే వాయుసేనా బేసులు, నౌకాస్థానాల నుంచి దళాలు తరలించబడ్డాయి.తైవాన్‌కు 2 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీ అందిస్తామని అమెరికా ప్రకటించడంత చైనా కోపంతో స్పందించింది. లాక్‌హీడ్ మార్టిన్, రేథియాన్ వంటి 20 రక్షణ సంస్థలు, 10 మంది అధిక అధికారులపై వివేకధారణలు విధించారు. ఈ ఆంక్షలు అమెరికన్ కంపెనీల వ్యాపారాన్ని ప్రభావితం చేస్తాయని నిపుణులు అంచనా.ఈ సంఘటనలు యూఎన్‌వోలో చర్చనీయాంశమయ్యాయి. ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా వంటి దేశాలు తమ సైనికులను అలర్ట్ చేశాయి. తైవాన్ అధికారులు తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు. ఈ ఉద్రిక్తతలు ఆగ్నేయాసియా వాణిజ్య మార్గాలు, సెమీకండక్టర్ సరఫరాను ప్రభావితం చేయవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు, స్టాక్ మార్కెట్లు కదలికలు చూపుతున్నాయి.

# సింహాచలంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాఖపట్నం డిసెంబర్ 30 (భారత శక్తి):

ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహా చలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా




జరుగుతు న్నాయి. ఈ పవిత్ర దినాన్ని పుర స్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారు భక్తులకు అత్యంత విశేషమైన ఉత్తర ద్వార దర్శనం అనుగ్రహిస్తున్నారు. ఉద యం నుంచే సింహగిరి పరిసరాలు భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగుతున్నాయి, ఆలయంలో భక్తిభావం వెల్లివిరుస్తోంది.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకంగా తెరిచారు. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే లభించే ఈ ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామిని సేవించుకుంటే మోక్షప్రాప్తి కలుగుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నమ్మకంతో తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారు. చలిని సైతం లెక్కచేయకుండా దీర్ఘ శ్రేణులలో క్యూలలో నిలబడి స్వామివారిని దర్శించుకుంటు న్నారు.పలువురు ప్రజాప్రతినిధు లు,అధికారులు కూడా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ స్థానాచా ర్యులు మాట్లాడుతూ ఈ పర్వదిన విశిష్టతను వివరించారు.”వైకుంఠ లోకంలో 33 కోట్ల దేవతలు స్వామివారిని సేవించి ఎలా అనుగ్రహం పొందారో, అదే విధంగా భూలోకంలోని వైష్ణవ క్షేత్రాలన్నింటిలోనూ ఈరోజు స్వామివారు ఉత్తర అభిముఖుడై దర్శనమివ్వడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. భక్తులందరూ ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామి అనుగ్రహాన్ని పొందాలి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, పోలీసులు విస్తృత ఏర్పాటు చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ల నిర్వహణ పటిష్టంగా చేపట్టారు.తాగునీరు, ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులో ఉంచారు.పోలీసుల పర్యవేక్షణలో భద్రతా చర్యలు చేపట్టారు.

# నిధుల వరద.. తర్వాత ఎన్నికలు...

హైదరాబాద్, డిసెంబర్ 30, ( (భారత శక్తి):

తెలంగాణలో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కనుంది. ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ.. అదే ఉత్సాహంతో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలఎన్నికలకు సమరశంఖం పూరిచేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థుల వార్షిక పరీక్షల సీజన్ ప్రారంభం కాకముందే.. అంటే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం జనవరి మూడో వారం నాటికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు పంపింది.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ఈ ఏడాది జనవరిలోనే గడువు ముగియడంతో ప్రస్తుతం ఇవి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మరోవైపు.. హైదరాబాద్ , ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ల గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువు ముగిసిన, ముగియనున్న అన్ని సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సర్కార్.. తాజాగా ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో జీహెచ్ఎంసీతో కలిపి మొత్తం 8 కార్పొరేషన్లు, 125 మున్సిపాలిటీలు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి. గడువు ఏప్రిల్ వరకు ఉన్న ఖమ్మం, వరంగల్ వంటి కొన్ని చోట్ల మాత్రం ప్రస్తుతానికి మినహాయింపు ఉండవచ్చుఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. జనవరి రెండో వారం నాటికి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడంతో పాటు, రాబోయే సాధారణ ఎన్నికలకు ముందే పట్టణ ఓటర్ల మొగ్గు ఎటువైపు ఉందో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలను అధికార పార్టీ ఒక 'సెమీఫైనల్'గా భావిస్తోంది.మరోవైపు.. ఎన్నికలకు ముందే ఓటర్లను ఆకట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధుల వర్షం కురిపిస్తోంది. పట్టణాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అక్టోబరులోనే రూ. 2,780 కోట్లు విడుదల చేసింది. జీహెచ్ఎంసీ మినహా మిగిలిన అన్ని పట్టణ సంస్థల్లో సుమారు 2,432 అభివృద్ధి పనులు ఈ నిధులతో జరగనున్నాయి. కొత్త మున్సిపాలిటీలకు రూ. 15 కోట్లు, కొత్త కార్పొరేషన్లకు రూ. 30 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించి జనవరి చివరి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఇలా ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు ఎన్నికల వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పోరుకు సర్వం సిద్ధం చేస్తోంది.

# పొదిలిలో సబ్ ఇన్స్పెక్టర్ వేమన వ్యవహార శైలికి వ్యతిరేకంగా వ్యాపార సంఘాల నిరసన

ఒంగోలు డిసెంబర్ 30 (భారత శక్తి):

ప్రకాశంజిల్లా పొదిలిలో ఎస్ఐ వేమన అరాచకంగా వ్యవహరిస్తూ ప్రజలను చితకబాదుతున్నారంటూ ఆర్యవైశ్య సంఘాలు ఆందోళన చేపట్టారు. ఎస్ఐ వేమన వ్యవహారశైలిపై జనం తిరగబడ్డారు. ఓ వ్యాపారస్థుడ్ని విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా బూతులు తిట్టారంటూ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్ పాటించారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటూ పోలీసు ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా కిందిస్థాయి సిబ్బంది మాత్రం ప్రజలపై దౌర్జన్యంగా వ్యవహరిస్తూ లాఠీలతో కొట్టడం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. పొదిలి ఎస్ఐ వేమనను సస్పెండ్ చేయాలంటూ పట్టణంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వ్యాపారస్తులు బంద్ పాటించారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి ర్యాలీలో పాల్గొన్నారు.

# మన్నార్ ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

నర్సాపురం డిసెంబర్ 30

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ ఆది కేశవ ఎంబార్ మన్నార్ దేవాలయంలో ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు చేసుకునేందుకు తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని క్యూలైన్లో ఉన్నారు. దీనిలో భాగంగా నరసాపురంలో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ అత్యంత పురాతనమైన వైష్ణవ దేవాలయమైన శ్రీదేవి , భూదేవి సమేత శ్రీ ఆదికేశవ స్వామి వార్లలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వైష్ణవ ఆలయాల్లో ప్రముఖ ప్రఖ్యాతిగాంచిన తమిళనాడులోని పెరంబూ దూర్ ఆలయాన్ని పోలిన ఈ ఆలయం ఈ ప్రాంతంలో ఉండడంతో తమిళనాడు తరహా లో ఈ ప్రాంతంలో వైష్ణవ పూజలు జరగడంతో అనేకమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు

# ఆచంటలో ఆధ్యాత్మిక వాతావరణం

ఆచంట డిసెంబర్ 30 (భారత శక్తి):

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆచంట మండలం వల్లూరు గ్రామంలోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలాంజనేయ స్వామి వారి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి మహా దీపారాధన చేశారు.భక్తుల కోసం ప్రసాద వితరణ ఏర్పాటు చేయగా, భజనలు మరియు కీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి..

# దానం ధైర్యం ఏమిటీ...

హైదరాబాద్, డిసెంబర్ 30, (భారత శక్తి):

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం ఒక పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. సాంకేతిక అంశాల సాకుతో కొందరు ఎమ్మెల్యేలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, దానం నాగేందర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఆయన తీసుకున్న నిర్ణయం, ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో ఇచ్చిన రూలింగ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వారు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినప్పటికీ, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇందులో అందరి దృష్టి దానం నాగేందర్‌పైనే ఉంది. ఎందుకంటే ఆయన కేవలం పార్టీ కండువా కప్పుకోవడమే కాదు, ఏకంగా కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటుకు తిరుగులేని సాక్ష్యం.బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేశారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా ఉండి, మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం అనేది ఫిరాయింపుల నిరోధక చట్టం కింద నేరుగా అనర్హతకు దారితీస్తుంది. స్పీకర్ నుంచి నోటీసులు అందినప్పటికీ దానం ఇప్పటివరకు వివరణ ఇవ్వకపోవడం గమనార్హంఅయితే, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి.

“నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎంఐఎం కలిసి 300 డివిజన్లలో గెలుస్తాయి” అని ఆయన ప్రకటించడం ద్వారా తన రాజకీయ గమ్యంపై స్పష్టత ఇచ్చేశారు. అంటే స్పీకర్ తనపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడకుండా, తానే ఒక అడుగు ముందుకేయాలని దానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.దానం నాగేందర్ ఇప్పుడు రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ అనర్హత వేటు వేస్తే, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, ముందే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. ప్రజల్లోకి నైతికతతో వెళ్ళినట్లు ఉంటుంది. ఉప ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసేందుకు అర్హత లభిస్తుంది. కోర్టు కేసులు, అనర్హత వేటు ముప్పు నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.దానం నాగేందర్ కేవలం ఖైరతాబాద్‌కే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా తన పట్టు నిలుపుకోవాలని చూస్తున్నారు. 300 డివిజన్లలో ప్రచారం చేస్తానని ప్రకటించడం ద్వారా, తాను కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతోంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ద్వారా తన ప్రాధాన్యతను నిరూపించుకోవాలని ఆయన ప్లాన్. ఒకవేళ దానం నాగేందర్ రాజీనామా చేసి ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే, అది తెలంగాణ రాజకీయాల్లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకోవడానికి ఇది ఒక పరీక్ష.దానం



నాగేందర్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన అంశం కాదు. ఇది తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలకు దిక్సూచి. స్పీకర్ నిర్ణయం కంటే ముందే ఆయన రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి దిగితే, అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమే అవుతుంది. దానం తీసుకునే ఈ బోల్డ్ స్టెప్ సక్సెస్ అయితే, మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కూడా అది ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది.

=============

# గులాబీకి కలిసి రాని కాలం

హైదరాబాద్, డిసెంబర్ 30, (భారత శక్తి):

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్, బీఆర్ఎస్ పేర్లు చెబితే పార్టీ క్యాడర్‌లో ఒక జోష్, ఉత్సాహం కనిపిస్తుంది. తెలంగాణ అభిమానుల్లో ఒక ఆవేశం తొణికిసలాడుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కేసీఆర్.. తిరుగులేని నాయకుడిగా గురి?తంపు తెచ్చుకున్నారు. అయితే 2023 ఎన్నికలనాటికి కేసీఆర్, అతని కుటుంబం అనుసరించిన విధానాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. దీంతో మూడోసారి గెలవాలన్న కేసీఆర్ ఆకాంక్ష నెలరవేరలేదు. దశాబ్దకాలం తిరుగులేని నేతగా ఉన్న కేసీఆర్ గ్రాఫ్ 2023 డిసెంబర్ తర్వాత నుంచి పడిపోతూ వస్తోంది. 2025లో అయితే ఇటు పార్టీ, అటు కుటుంబం, మరోవైపు అనారోగ్య సమస్యలు కేసీఆర్‌ను చుట్టుముట్టాయి. దీంతో దాదాపు ఏడాదికాలం ఆయన ప్రజలో?లకి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఆశించిన ప్రభావం చూపలేదు. పార్టీలో కలహాలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు, సొంత పార్టీపైనే కూతురు ఆరోపణలు.. కేసీఆర్‌పై మరింత ఒత్తిడి పెంచాయి2025 కేసీఆర్‌కు పరీక్షల సంవత్సరంగా మారింది. పార్టీ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలని కేసీఆర్ పట్టుదలగా పోరాడుతున్నారు. సుప్రీం కోర్టు వరకు కూడా వెళ్లారు. అయితే కేసుల్లో వేగం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ. ఇక కేసీఆర్ కూతురు, ఎమ్మెల్యే కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేశారు. సొంత నేతలపైనే ఆరోపణలు చేశారు. దీంతో చివరకు కూతురును కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి కేసీఆర్‌కు వచ్చింది. అయితే కవిత పార్టీని వదిలి, తండ్రి పాలనపై దర్యాప్తు చేస్తానని షాక్ ఇచ్చారు. ఆమె లక్ష్యం వేరైనా, దెబ్బ తగిలేది కేసీఆర్‌కేబీఆర్ఎస్ కార్యకర్తల్లో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆందోళనా గుసగుసలు ఎక్కువ. ఏడాదంతా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే పరిమితం కావడం అనుమానాలకు తావిచ్చింది. అవసర సమయంలో వైద్య పరీక్షలకు వస్తున్నారు. అక్కడి నుంచే పార్టీ ఆదేశాలు జారుతున్నాయి. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించినా, మేడిగడ్డ బ్యారేజ్, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో విచారణలు, ఫార్ములా-ఈ రేస్ ఆరోపణలు కుటుంబాన్ని చుట్టుముట్టాయి. ఈ ఒత్తిడులు ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని పార్టీలో అభిప్రాయం.2025-26 బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ తొలిరోజు మాత్రమే కనిపించారు. కొద్ది నిమిషాల పాటే. తర్వాత




అసెంబ్లీలో ముఖం చూపలేదు. తాజాగా శీతాకాల సమావేశాల తొలిరోజు మళ్లీ హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి నమస్కారం చేసిన ఆ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేవలం ఐదు నిమిషాలే అసెంబ్లీ హాల్‌లో ఉండి వెళ్లిపోయారు. హాజరు పడేందుకే కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నట్లు కనిపిస్తోంది.కేసీఆర్ పార్టీకే కాదు ప్రజలకూ దూరంగా ఉంటున్నారు. జల వివాదాల మధ్య నల్లగొండలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ భారీ పబ్లిక్ మీటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ప్రజల ముందు కనిపించలేదు. రెండేళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తన స్టైల్‌లో విమర్శలు గుప్పించారు. కానీ తర్వాత మళ్లీ సైలెంట్ అయ్యారు. దీంతో ప్రజల్లోనూ, పార్టీలోనూ కేసీఆర్ గ్రాఫ్ పడిపోతోంది.

2025 సంవత్సరం బీఆర్ఎస్ రెండు కీలక ఎన్నికలు ఎదుర్కొంది. జూబ్లీహిల్స్ బై-పోల్‌లో మాగుంట గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో మాత్రం మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మొత్తంగా 2025 కేసీఆర్‌కు పరాజయాలే ఎక్కువగా ఎదురయ్యాయి.

# స్త్రీ నిధి పేరుతో యాప్

హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి):

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అసవరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది.

మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే మహిళలు లోన్ కోసం అప్లై చేసుకోవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అసవరం లేదు. ఇప్పటికే రుణం తీసుకున్నవారే కాకుండా కొత్తగా లోన్ తీసుకోవాలనుకునేవారు ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మహిళలు తాము నెలనెలా చెల్లించే వాయిదాల సొమ్మును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కొంతమంది తమ సభ్యులకు తెలియకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పుడు ప్రతీ మహిళ తాము చెల్లించిన డబ్బులు అకౌంట్లో పడ్డాయా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ డబ్బులు జమ కాకపోతే అధికారులను వెంటనే సంప్రదించవచ్చు. అలాగే గతంలో చెల్లించిన సొమ్మును బట్టి ఎంత రుణం వస్తుంది.. ?రుణం పొందిన తర్వాత స్టేటస్ ఏంటి..? ఎవరి దగ్గర పెండింగ్ ఉంది..? అనే అన్నీ వివరాలను స్త్రీ నిధి యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముంది.డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలంటే..?

-గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి అని సెర్చ్ చేయండి-మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోండి

-ఫోన్ నెంబర్ టైప్ చేసి రిజిస్టర్ అవ్వండి

# ఎయిర్ పోర్టుకు అంతా రెడీ...

వరంగల్, డిసెంబర్ 30, (భారత శక్తి):

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనులు వేగవంతమయ్యాయి ఏఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూములను పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటికే 253 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించి, రూ. 295 కోట్ల పరిహారాన్ని రైతులకు అందజేసింది. దీంతో మొత్తం భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. జనవరి 2026లో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి విమాన సర్వీసులు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. అయోధ్య, కొచ్చిన్ విమానాశ్రయాల తరహాలో దీనిని అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విమాన సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా దశాబ్దాల కాలంగా నిరీక్షిస్తున్న వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ పనుల్లో ఒక కీలకమైన ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం.. సేకరించిన భూమిని అధికారికంగా భారత విమానయాన సంస్థకు అప్పగించింది. వరంగల్ జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసింది. శనివారం భారత విమానయాన సంస్థ హైదరాబాద్ జనరల్ మేనేజర్ బి.వి. రావు నేతృత్వంలోని బృందం మామునూరు ప్రాంతాన్ని సందర్శించింది. గతంలో ఈ విమానాశ్రయం పరిధిలో ఉన్న 696.14 ఎకరాలకు తోడు.. తాజాగా సేకరించిన 253 ఎకరాల ప్రైవేటు భూమిని కలిపి మొత్తం సుమారు 950 ఎకరాల భూమిని విమానాశ్రయ అథారిటీకి అప్పగించారు. రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు సుమారు రూ. 1.20 కోట్ల చొప్పున మొత్తం రూ. 295 కోట్లను పరిహారంగా చెల్లించింది. ఆర్బిట్రేషన్ ప్రక్రియ ద్వారా రైతుల అభ్యంతరాలను పరిష్కరించి.. ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా భూములను స్వాధీనం చేసుకుంది. రెవెన్యూ, రహదారుల శాఖ అధికారులతో కలిసి విమానయాన సంస్థ బృందం భూమి సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. త్వరలోనే ఈ భూమి బదలాయింపు పత్రాలను ప్రభుత్వం అధికారికంగా అందజేయనుంది. మామునూరు విమానాశ్రయాన్ని ఒక చిన్న విమానాశ్రయంగా కాకుండా.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయాన్ని ఎంత వేగంగా నిర్మించారో.. అదే వేగంతో దీనిని పూర్తి చేయాలని సంకల్పించింది. కేరళలోని కొచ్చిన్ విమానాశ్రయం తరహాలో ఆధునిక వసతులు, పచ్చదనంతో దీనిని అలంకరించనున్నారు. ప్రస్తుతానికి ఉన్న చిన్న రన్‌వేను విస్తరించి.. ప్రారంభంలో 72 సీట్ల సామర్థ్యం ఉన్న చిన్న విమానాలను నడపనున్నారు. ప్రయాణికుల స్పందనను బట్టి పెద్ద విమానాలు దిగేలా రన్‌వేను మరింత అభివృద్ధి చేస్తారు. సాధారణంగా శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని ఒప్పందం ఉంది. కానీ.. ప్రభుత్వం ఈ నిబంధనల నుంచి మామునూరుకు మినహాయింపు తీసుకురావడంలో విజయం సాధించిందివరంగల్‌కు విమాన సౌకర్యం రావడం వల్ల ఉత్తర తెలంగాణ ఆర్థిక చిత్రం పూర్తిగా మారిపోనుంది. వరంగల్‌లో ఉన్న ఐటీ హబ్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఇది కొత్త ఊపిరి పోయనుంది. పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులు నేరుగా వరంగల్ చేరుకునే అవకాశం ఉండటంతో మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడిని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల స్థానిక రవాణా, హోటల్ వ్యాపారాలు పుంజుకుంటాయి. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. నాలుగు దశాబ్దాల పాటు మూతపడి ఉన్న ఈ విమానాశ్రయాన్ని పునరుద్ధరించడానికి ఒక స్పష్టమైన కాలపరిమితిని ప్రభుత్వం నిర్ణయించుకుంది. 2026 జనవరి మాసంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంయుక్తంగా ఈ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించే అవకాశం ఉంది. 2027 చివరి నాటికి మొదటి విమానాన్ని గాల్లోకి ఎగురవేయడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే దీనికి అవసరమైన అన్ని రకాల క్లియరెన్సులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల పర్యవేక్షించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కావడంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణంలో ఒక అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. ఇది ఓరుగల్లు ప్రాంత అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలవబోతోంది.



===========

# నిమ్స్ ఉద్యోగుల నిరీక్షణకు తెర

హైదరాబాద్, డిసెంబర్ 30, (భారత శక్తి):

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. వీరు కోరుతున్న విధంగా ఆర్జిత సెలవుల నగదు మార్పిడి సౌకర్యాన్ని కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో నం. 230 జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న రెగ్యులర్ సిబ్బందికి ఇకపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ సెలవులను సరెండర్ చేసి నగదు పొందే వీలుంటుంది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి' సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో.. ప్రభుత్వం దీనికి సంబంధించి కీలకమైన ఉత్తర్వులను (జీవో నంబర్ 230) విడుదల చేసింది. నిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎయిమ్స్ తరహాలో శాలరీలు అమలులో ఉన్నాయి. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే 'సెలవుల నగదు మార్పిడి' సదుపాయం వీరికి గతంలో వర్తించేది కాదు. దీనివల్ల ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా వాడుకోకుండా మిగిలిపోయిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యను పరిష్కరించాలని నిమ్స్ ఉద్యోగ సంఘాలు.. ముఖ్యంగా నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఇటీవల వారు మంత్రిని కలిసి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను సమన్వయం చేశారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. తెలంగాణ సెలవు నిబంధనలు-1933 ఇకపై నిమ్స్ ఉద్యోగులకు కూడా వర్తిస్తాయి. దీనివల్ల.. ఉద్యోగులు తమ ఖాతాలో ఉన్న ఆర్జిత సెలవులను ప్రభుత్వానికి అప్పగించి (సరెండర్ చేసి), దానికి సమానమైన నగదును పొందే వీలుంటుంది. ఇది అత్యవసర సమయాల్లో లేదా పదవీ విరమణ సమయంలో వారికి పెద్ద ఆర్థిక ఆసరాగా మారుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నిమ్స్ సిబ్బందికి కూడా ఈ హక్కు లభించడం వల్ల వారిలో వివక్ష తొలగిపోతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సేవలు అందించే నర్సులు.. పారామెడికల్, ఇతర సాంకేతిక సిబ్బందిలో ఈ నిర్ణయం నూతనోత్సాహాన్ని నింపుతుంది. ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల ఆసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేసే వారికి ఇలాంటి రాయితీలు ఇవ్వడం వల్ల వారు మరింత నిబద్ధతతో పనిచేస్తారని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఈ జీవోను జారీ చేస్తూ.. నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలని సూచించారు. ఈ నిర్ణయం పట్ల నిమ్స్ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ దీర్ఘకాలిక సమస్యను అర్థం చేసుకుని.. తక్షణమే జీవో వచ్చేలా కృషి చేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహాకు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. వేలాది మంది కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా మేలు జరగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల అడుగు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా దారి చూపుతుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు




# ఇక టోల్ ఫ్రీ ప్రయాణం

నల్గొండ, డిసెంబర్ 30, (భారత శక్తి):

తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి ప్రయాణాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతోంది. పండుగ రోజుల్లో టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోకుండా ఉండేందుకు.. ఆ మూడు నాలుగు రోజుల పాటు టోల్ వసూళ్లను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్ణయించారు. దీనిపై చర్చించేందుకు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం నుండి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ప్రయాణికులకు టోల్ కష్టాలు తప్పవు. ముఖ్యంగా పంతంగి, కొర్లపహాడ్ చిల్లకల్లు వంటి టోల్ ప్లాజాల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరుతుంటాయి. ఫాస్టాగ్ సౌకర్యం ఉన్నప్పటికీ.. వాహనాల సంఖ్య లక్షల్లో ఉండటంతో ఒక్కో టోల్ ప్లాజా దాటడానికి గంటల సమయం పడుతోంది. పండుగకు వెళ్లే ఉత్సాహంలో ఉన్న సామాన్యులకు ఈ ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని చూపిస్తున్నాయి. చంటిపిల్లలు, వృద్ధులతో ప్రయాణించే వారు ఈ రద్దీలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏటా కనిపిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ జాతీయ రహదారిపై పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వివిధ చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వంతెనలు, సర్వీసు రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల కారణంగా రహదారిపై ఇప్పటికే అనేక చోట్ల మళ్లింపులు ఉన్నాయి. సాధారణ రోజుల్లోనే వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా.. ఇక పండుగ రద్దీ తోడైతే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టోల్ వసూళ్ల కోసం వాహనాలను ఆపితే.. ఆ రద్దీ వెనక్కి కిలోమీటర్ల మేర విస్తరించి హైవే అంతా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. క్లిష్ట పరిస్థితిని గమనించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ప్రజలకు ఊరటనిచ్చేలా టోల్ మినహాయింపు అంశాన్ని తెరపైకి తెచ్చారు. టోల్ గేట్ల నిర్వహణను తాత్కాలికంగా నిలిపివేస్తే వాహనాలు ఆగకుండా సాఫీగా సాగిపోతాయని తద్వారా ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించే సమావేశంలో ఈ ప్రతిపాదనపై స్పష్టత రానుంది. కేంద్ర ప్రభుత్వం గనుక దీనికి సానుకూలంగా స్పందిస్తే.. ఈ ఏడాది సంక్రాంతి ప్రయాణం సామాన్యులకు ఎంతో హాయిగా మారనుంది



# పీపుల్స్ స్టార్, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకుడు,గొప్ప నటుడు ఆర్.నారాయణ మూర్తి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని

)పీపుల్స్ స్టార్, విప్లవ సినిమాల నిర్మాత, దర్శకుడు,గొప్ప నటుడి గా సుపరిచితుడైన ఆర్. నారాయణ మూర్తి తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి మండలంలోని మల్లంపేట గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో డిసెంబర్ 31, 1953లో జన్మించాడు. అమ్మ పేరు రెడ్డి చిట్టెమ్మ, నాన్న పేరు రెడ్డి చిన్నయ్య నాయుడు. వీరిది అతి సాధారణ రైతు కుటుంబం. రౌతులపూడిలో 5వ తరగతి వరకు చదివాడు. రౌతులపూడిలో ఒక సినిమా థియేటర్ ఉండేది. చిన్నతనం నుండి సినిమాలలో ఆసక్తితో ఎన్టీయార్, నాగేశ్వరరావుల సినిమాలు చూసి, విరామ సమయంలో వారిని అనుకరించేవాడు. అక్కడే తన నటనా జీవితానికి పునాది పడిందని చెప్పుకున్నాడు. శంఖవరంలో ఉన్నత పాఠశాలలో చేరాడు. అక్కడే నారాయణమూర్తికి సామాజిక స్పృహ కలిగింది. సామాన్య ప్రజలకు జరిగే అన్యాయాలను గమనించి, విప్లవ ఉద్యమాలవైపు ఆకర్షితుడయ్యాడు. పెద్దాపురంశ్రీ రాజ వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ జగపతి బహద్దర్ మహారాణి కళాశాలలో బి.ఏ చదవడానికి చేరాడు. అక్కడ రాజకీయాలతో ప్రభావితుడై, సినిమాలు, రాజకీయాలు, సామాజిక బాధ్యత అనే మూడు వ్యాసంగాలపై ఇష్టాన్ని ఏర్పరచుకున్నాడు. కళాశాల ఈయన విద్యార్థిసంఘానికి అధ్యక్షుడిగానే కాకుండా కళాశాల లలిత కళల విభాగానికి కార్యదర్శిగా కూడా ఉన్నాడు. అంతేకాక తను ఉంటున్న ప్రభుత్వ హాస్టలు యొక్క విద్యార్థి అధ్యక్షునిగానూ, పేద విద్యార్థుల నిధి సంఘానికి కార్యదర్శి గానూ పనిచేశాడు. స్థానిక రిక్షా కార్మికులు ఈయనను మద్దతుకోసం సంప్రదించేవారు. నారాయణమూర్తి పట్టణ రిక్షాసంఘం అధ్యక్షుడుగా కూడా ఉన్నాడు. ఎమర్జెన్సీ కాలంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందు వలన పోలీసులు ఈయన్ను తీసుకునివెళ్ళి విచారణ కూడా చేశారు. అంతేకాక నారాయణమూర్తి సినిమా నటి మంజులతో ఒక ప్రదర్శన ఏర్పాటు చేయించి నూతన కళాశాల నిర్మాణానికి నిధుల సేకరణ ప్రారంభించాడు. అప్పట్లో బీహార్లో వరదసహాయానికి తగిన విధంగా తోడ్పాడ్డాడు. సహవిద్యార్థులు నారాయణమూర్తిని కాలేజీ అన్నగా వ్యవహరించేవారు. ఇతడిలోని కళాతృష్ణని ఎలా కనిపెట్ట గలిగారో కానీ పరిచయం కాగానే రమేష్ బాబు హీరోగా ఆయన తీస్తున్న నీడ చిత్రంలో ఇతడికి ప్రాధాన్యత ఉన్న వేషాన్నిచ్చారు. ఆ సినిమాలో నారాయణమూర్తి కొంత ప్రాధాన్యత ఉన్న నక్సలైటు పాత్ర లభించింది. సినిమా బాగా విజయవంతమై, నారాయణమూర్తి మద్రాసులోని చోళ హోటల్లో కరుణానిధి చేతులపై వంద రోజుల షీల్డు అందుకున్నాడు. ఆ తరువాత దాసరి, రామానాయుడు, జ్యోతి శేఖరబాబు వంటి దర్శకుల ప్రోత్సాహంతో అనేక సినిమాలలో సహాయపాత్రలలో నటించాడు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో నారాయణమూర్తి పూర్తిస్థాయి హీరోగా సంగీత అనే సినిమా తీశాడు. ఈ చిత్రాన్ని పూర్ణాపిక్చర్స్ పతాకంపై హరగోపాల్ నిర్మించాడు. అందులో రెండు పాటలను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాడాడు. చిత్రం ఒక మోస్తరు విజయం సాధించి 50 రోజులపాటు ఆడింది. అయితే ఆ తర్వాత హీరోగా అవకాశాలు రాలేదు, చిన్నవేషాలకు కూడా తీసుకోక బాగా కష్టాలను ఎదుర్కొన్నాడు. తిండికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలోనే హీరో అవ్వాలంటే మొదట దర్శకునిగా నిలదొక్కుకోవాలని అనుకున్నాడు. దర్శకునిగా పూర్వానుభవం లేకపోవటం వలన, ఎవరూ సినిమా తీసే అవకాశం ఇవ్వలేదు. షూటింగులు ఉన్నప్పుడల్లా దాసరి పనితీరును గమనిస్తూ ఉండేవాడు. దర్శకునిగా తనకు తాను అవకాశమిచ్చుకోవటానికి తనే నిర్మాత అయితే కానీ కుదరదని గ్రహించి, స్నేహితులకు తన ఆశయం తెలియజేయగా, వాళ్లు కొంతమంది నారాయణమూర్తి సినిమా నిర్మించడానికి సహాయం చేశారు. అందుకే తన బ్యానరుకు "స్నేహ చిత్ర" అని పేరు పెట్టుకున్నాడు. భారత-రష్యా స్నేహ కరచాలనాన్ని చిహ్నంగా ఎంచుకున్నాడు. నారాయణమూర్తి నిర్మాత, దర్శకుడిగా తన మొదటి సినిమా అర్ధరాత్రి స్వతంత్రం చిత్రీకరణను 1984 జూన్ 10న రంపచోడవరంలో ప్రారంభించాడు. ఆ సినిమా పదహారున్నర లక్షల పెట్టుబడితో పూర్తయింది. సెన్సారుతో వచ్చిన చిక్కులను కొంతమంది వ్యక్తుల సహకారంతో అధిగమించి సినిమాను 1986, నవంబరు 6, టి.కృష్ణ వర్ధంతి రోజున విడుదల చేశాడు. ఆ సినిమాలోనారాయణమూర్తి ఒక నక్సలైటు పాత్రను పోషించాడు. ఈ సినిమా ఊహించినంతగా విజయవంతమై చరిత్ర సృష్టించింది. ఈ సినిమా విజయవంతమవటానికి వంగపండు ప్రసాదరావు వ్రాసిన పాటలు, పి.ఎల్.నారాయణ సంభాషణలు, నారాయణమూర్తి కథ, చిత్రానువాదము, దర్శకత్వం ఎంతగానో దోహదం చేశాయి. నారాయణమూర్తి సినిమాలన్నీ సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తంగా తీసినవే. ఈయన చిత్రీకరించిన సినిమాల్లో నిరుద్యోగం, ప్రపంచ బ్యాంకు విధానాలు, డబ్ల్యూటీవో ఒప్పందం, తృతీయ దేశాల సమస్యలు, పర్యావరణ సమస్యలు, ఆనకట్టలు, నిర్వాసితుల సమస్యలు, భూ సమస్యలు, రాజకీయ అతలాకుతలాలు మొదలైనటువంటి వాటికి అద్దంపట్టాడు.



# ఓసిల బహిరంగసభను విజయవంతం చేయాలి 11న వరంగల్ కు తరలిరావాలని పిలుపు

## బహిరంగ సభ గోడ ప్రతిని ఆవిష్కరించిన ఆర్ బి వి ఆర్ ఆర్ జిల్లా సంఘం



కరీంనగర్, డిసెంబర్ 30(భారతశక్తి ప్రతినిధి,)

వచ్చే నెల 11న వరంగల్ జిల్లాలో ఓసిల సింగగర్జన సభను విజయవంతం చేయాలని ఆర్ బి వి ఆర్ ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సీతారాంపూర్ లోని రెడ్డి సంఘం పంక్షన్ హాలులో ఓసి జే ఎ సి ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హన్మకొండ నగరంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఓ సి ల బహిరంగ సభ గోడ ప్రతిని ఓ సి జె ఏ సి రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్ల నరసింహ రెడ్డి, ప్రచార కార్యదర్శి జి. స్వామి రెడ్డి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు సమ్మిరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి, నరసింహ రెడ్డిలు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి ఓసి కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓసీలు బహిరంగ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి వి ఆర్ ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, జిల్లా కోశాధికారి కాసర్ల మధుకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గన్ను మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారం జగన్నాథ రెడ్డి, దాసరి రాంరెడ్డి, ద్యావ భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చింతల శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక నాయకులు భూంపెల్లి రాఘవ రెడ్డి, రేకులపెల్లి రవీందర్ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, కంట్రరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఘనంగా నేరెళ్ల వేణుమాధవ్ స్వరార్చన, ప్రతిభా పురస్కార కార్యక్రమం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్30:



రామా చంద్రమౌళికి నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ 94వ జయంతి, స్వరార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని వేణుమాధవ్ కళాప్రాంగణంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. తొలుత నేరెళ్ల వేణుమాధవ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజాకవి, ప్రముఖ గాయకుడు వరంగల్ శ్రీనివాస్, ప్రముఖ సినీ, మిమిక్రీ కళాకా రుడు ఫన్ స్టార్ శివారెడ్డి, జబర్దస్త్ ఫేమ్, సినీ నటుడు రాకింగ్ రాకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు నేరెళ్ల శోభావతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఉన్న కళ బయటికి తీసుకువచ్చేందుకు నేరెళ్ల వేణుమాధవ్ ఎంతో కృషి చేశారన్నారు. కల ఎవరి సొత్తు కాదని, ఎవరు నేర్చుకుంటే వారికి వస్తుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కార్యదర్శి డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. వేణుమాధవ్ ప్రదర్శన ఇచ్చిన తర్వాత ప్రతి సారి ఎలా ఉంది అని అడిగేవారని, నేను బాగున్నది అని చెప్పేవాడిన్నారు. ఆయన్ను ప్రతిక్షణం గుర్తు చేసుకుంటున్నట్లు చెప్పారు. అత్యంత ఉన్నత స్థానా నికి మిమిక్రీ కళను తీసుకెళ్లారని గుర్తుచేశారు. వివిధ ప్రముఖుల గొంతులను సహజంగా అనుకరిస్తూ, హాస్యంతో పాటు సందేశాత్మక అంశాలను కూడా అందిస్తూ మిమిక్రీ కళకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొని ప్రేక్షకుల నుంచి విశేష స్పందన పొందిన బాలమురకృష్ణ, యువతకు ప్రేరణగా నిలిచి, భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ కవి, కథా రచయిత, నవలాకారులు ప్రొఫెసర్ రామాచంద్రమౌళికి నేరెళ్ల వేణుమా ధవ్ స్మారక ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. కార్యక్ర మంలో నేరెళ్ల శ్రీనాథ్, నేరెళ్ల రాధాకృష్ణ, సలహా మండలి సభ్యులు డాక్టర్ గిరిజామనోహర్ బాబు, వనం లక్ష్మీకాంతారావు, కొణతం కృష్ణ, పాట్లపల్లి శ్రీనివాసరావు తదితలు పాల్గొన్నారు.

లిమిమిక్రీతో ఆకట్టుకున్న ఫన్ స్టార్ శివారెడ్డి, జబర్దస్త్ ఫేం రాకేష్లి

ఫన్ స్టార్, సినీ నటులు శివారెడ్డి, జబర్దస్త్ ఫేం రాకేష్ వారి మిమిక్రీతో ప్రేక్షకులను మంత్రముగ్ధ లను చేసి అలరించారు. ఈ సందర్భంగా ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు. అనంతరం నేరెళ్ల వేణుమాధవ్ శిష్యులు, ప్రముఖ మిమిక్రీ కళాకారుల ధ్వన్యను కరణతో అందరినీ అలరించారు. మిమిక్రీ కళాకారులు అంజన్కు మార్, రాజ్కుమార్, దామోదర్, రాజు, మక్సూద్, పరశురాము, సదా శివ, కిరణ్, మనోహర్, హన్మంతరావు, శ్రీను, వేణు, శ్రీనివాస్, రెహ మాన్, పరమేశ్, నారాయణ, జంగోజీ, శ్రీధర్, భాస్కర్, బాబర్, రామస్వామి, స్వామి, సత్యం, కృష్ణ, సుబ్రహ్మణ్యం, సాంబశివుడు, ఇందిర, నిజామాబాద్ శంకర్, బాబుమియా, మధు పాల్గొన్నారు.

# సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం: బోనకల్ ఎస్సై పొదిల వెంకన్న

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 30: డీజే సిస్టంకు ఎలాంటి అనుమతులు లేవు డీజే యజమానులు గమనించగలరు డీజేలపై కేసులు నమోదు చేయబడుతాయనీ బోనకల్ ఎస్సై పోదిల వెంకన్న తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....మండలంలోని కొంతమంది ప్రజలు గ్రామపంచాయతీ ఎలక్షన్స్ నుండి ఇంకా బయటకు రాలేదు కాబట్టి ఈ వేడుకల సందర్భంగా ఏమైనా చిన్న చిన్న గొడవలు జరిగి గ్రూపు మధ్య తగాదాలుగా మారితే వాళ్లతో పాటు ఆ కార్యక్రమం ఎవరైతే ఏర్పాటు చేశారో వాళ్లపై ఖచ్చితంగా కేసులు నమోదు చేయబడతాయి. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండల పరిధిలో స్థానిక పోలీసులతో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకల పేరుతో జరిగే కార్యక్రమాల వల్ల పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుడదు వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకులు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లుపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, సమస్యలు రాకుండా స్థానిక పోలీసుల అధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని సూచించారు. అలాగే ప్రజలకు




ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడుతుందన్నారు. పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కల్సి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని బోనకల్ ఎస్సై మండల ప్రజలకు సూచించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దోమ తెరలు పంపిణీ



ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 30 (భారత శక్తి):

ములుగు లయన్స్ క్లబ్ ఎల్. సి వివేకానందపురం క్లబ్ ల ఆధ్వర్యంలో ములుగు మండలంలోని దేవగిరి పట్నం గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని నిరుపేద కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ములుగు లయన్స్ క్లబ్ వారు తమ కాలనీ లో ఇంతకుముందు కూడా చలి దుప్పట్లు, చెద్దర్లు వంట సామాగ్రిని అందించారు. ములుగు లయన్స్ క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఎక్కంటి నరసింహారెడ్డి ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ చుంచు రమేష్, పి జడ్ సి సానికొమ్మ రవీందర్ రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ మేరుగు రమేష్, లయన్ సోమ నరసయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్ల్యూ జే ఐ జిల్లా అధ్యక్షులు జగన్నాథ రెడ్డిని సన్మానించిన ఆర్బివిఆర్ఆర్

కరీంనగర్, డిసెంబర్ 30(భారతశక్తి ప్రతినిధి)



వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్) జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డిని ఆర్ బి వి ఆర్ ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు..

మంగళవారం నగరంలోని సీతారాంపూర్ లోని రెడ్డి సంక్షేమ సంఘం పంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షులు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, కోశాధికారి కాసర్ల మధుకర్ రెడ్డి, సలహా మండలి సభ్యులు ఉచ్చిడి మోహన్ రెడ్డి, బద్దం మోహన్ రెడ్డి, భూంపెల్లి రాఘవ రెడ్డి, పెండ్యాల కేశవ రెడ్డి, వడియాల యశ్వంత్ రెడ్డిలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడి జిల్లా పేరును ఆదర్శంగా తీసుకురాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఆర్ బి వి ఆర్ ఆర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గన్ను మహేందర్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శులు దాసరి రాంరెడ్డి, ద్యావ భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చింతల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రేకులపల్లి రవీంధర్ రెడ్డి, కంట్టారెడ్డి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.

# డబ్ల్యూజెఐ కార్యవర్గానికి కోమటిరెడ్డి అభినందన

కరీంనగర్, డిసెంబర్ 30(భారతశక్తి ప్రతినిధి):




వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాకరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శాతవాహన పట్టణ అభివృద్ధి సంస్థ (సూడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అభినందించారు. డబ్ల్యూజేఐ అధ్యక్షుడు దారం జగన్నాథ రెడ్డి నేతృత్వంలో కార్యదర్శి గుడాల శ్రీనివాస్, కోశాధికారి చిటిమల్ల మహేం దర్, సంయుక్త కార్యదర్శులు డి ఎస్ ప్రసాద్, రమేష్ తదితరులు మంగళవారం తన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడంలో తన వంతు సహకారం ఉంటుందని నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల నివేషణ స్థలాల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రయోజనం చేకూరాలన్నది తమ ప్రభుత్వ అభిమతమని ఆయన తెలిపారు. డబ్ల్యూజేఐ కార్యవర్గం జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని, సాధ్యమైనంత మేరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. డబ్ల్యూజేఐ నూతన కార్యవర్గం జర్నలిస్టుల సమస్యలతో పాటు, ప్రజోపయోగ కార్యక్రమాలుచేపడుతుందనే ఆశాభవం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యులు పులి సంతోష్ గౌడ్, రామకృష్ణ, నాయకులు మైలారం తిరుపతి లు పాల్గొన్నారు.

# జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సమర్థ పనితీరు

## -ఆన్‌లైన్ బెట్టింగ్, అక్రమ పశువుల రవాణా ముఠాలపై ఉక్కుపాదం

## -జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 30 (భారత శక్తి):జిల్లాలో ఈ సంవత్సర కాలంలో జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన శాంతి భద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత చర్యలు మరియు సాధించిన ప్రగతిని ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో లిజిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్‌లి వార్షిక ప్రెస్‌మీట్ ద్వారా వివరాలను వెల్లడించారు.

జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. పండుగలు, పంచాయతీ ఎన్నికలు, జాతరలు, భారీ సమావేశాల సమయంలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం జరిగింది.జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముఖ్యంగా హత్యలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్, ఆన్‌లైన్ మోసాలు వంటి కేసుల్లో నేరస్తులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది.అదే విదంగా పెండింగ్ కేసుల పరిష్కారంలో కూడా గణనీయమైన పురోగతి సాధించాం.మహిళలు, బాలల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది,ఇందుకోసం షీ టీమ్స్ ,AHTU, భరోసా సెంటర్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పై అవగాహన కార్యక్రమాలు, చేపట్టాం.అదే విదంగా జిల్లా అంబిస్ టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ దిశగా అడుగులు వేయడం జరిగిందని ,%జజుఎ% నెట్‌వర్క్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకున్నాం అన్నారు.

జిల్లాలో శాంతిభద్రతలను అదుపులో ఉంచడం మరియు ప్రజలకు మెరుగైన భద్రత సేవలు అందించడంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అహర్నిశలు కష్టపడి చేసిన సేవలు ఉన్నాయని వారి నిబద్ధతకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.అదే విధంగా జిల్లా ప్రజలు పోలీసులకు అందిస్తున్న సహకారం అభినందనీయం అని భవిష్యత్తులో కూడా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని అన్నారు.

పోలీస్ అక్క కార్యక్రమం మనకి చాలా మంచి పేరు తీసుకు వచ్చింది.శివంగి టీం కూడా రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు సాధించింది.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన నిర్మల్ జిల్లాలో శివంగి దళాన్ని ప్రారంభించడం జరిగింది. శివంగి టీం రెస్క్యూ ఆపరేషన్లు, లా అండ్ ఆర్డర్ నిర్వహణలో విశేషంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చింది.

బాసర పరిధిలోని తట్టు ప్రాంతాలు, బంగల్ పేట్ చెరువు వంటి ప్రాంతాల్లో వర్షాకాలంలో ఏర్పడే ప్రమాదాలను ముందుగానే గుర్తించి, శివంగి టీంకు చెరువుల్లో కఠినమైన రెస్క్యూ శిక్షణ అందించడం జరిగింది. అలాగే బోరెగావ్ విలేజ్ లో శివంగి టీం నిరంతరం మానిటరింగ్ చేయడంతో ప్రస్తుతం అక్కడ పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా ఉంది.నారీ శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు సంబంధించిన డయల్స్ అటెండ్ చేయడం, అలాగే విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. జిల్లాలో 99% గంజాయి సాగు పూర్తిగా నిలిచిపోయింది.జిల్లాలో రెండు నెలలు వరదలు సంభవించిన సమయంలో, ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా పోలీస్ శాఖ తక్షణమే స్పందించింది. మంచిర్యాల్ చౌరస్తాలో మనిషి మునిగిపోయేంత నీరు చేరిన సందర్భంలో, రెండు గంటల పాటు పోలీసులు అక్కడే ఉండి నీటిని తొలగించి ట్రాఫిక్‌ను సకాలంలో పునరుద్ధరించారు.వరదల సమయంలో పశువుల కాపరి చిక్కుకుపోయిన ఘటనలో, రెండు రోజుల పాటు శ్రమించి,సురక్షితంగా రక్షించగలిగాం. CEIR పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు రూ. 2.16 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగింది.చెప్పుకోదగ్గ మరో ముఖ్యమైన విషయం (పశువుల అక్రమ రవాణా) ముఠాను అరెస్టు చేయడం ద్వారా పశువుల అక్రమ రవాణా పూర్తిగా తగ్గింది.గణేష్ నిమజ్జన బందోబస్తు పూర్తిగా ప్రశాంతంగా, ఎలాంటి లాఠీచార్జ్ లేకుండా విజయవంతంగా ముగిసింది.కమ్యూనిటీ భాగస్వామ్యంలో మహిళలకు సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.గంజాగస్తీ కార్యక్రమంలో భాగంగా రోడ్డు సౌకర్యం లేని గుమ్మన యంగ్లపూర్ గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాలీబాల్ కిట్లు, రేషన్, దుప్పట్లు పంపిణీ చేశాం.ఇంతకు ముందు నైట్ పెట్రోలింగ్ నిర్మల్, భైంసా పట్టణాలకు మాత్రమే పరిమితమై ఉండేది. ప్రస్తుతం అది ముధోల్, ఖానాపూర్ ప్రాంతాల్లో కూడా ప్రారంభించడంతో దొంగతనాలు గణనీయంగా తగ్గాయి.ట్రాఫిక్, సైబర్ క్రైమ్, ఉమెన్ పోలీస్ స్టేషన్‌ల కోసం కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పంపించడం జరిగింది. అది ప్రస్తుతం ఆచరణ దశలో ఉంది.

నమోదైన నేరాలు:

2025లో జిల్లాలో 4162 నేరాలు నమోదయ్యాయి,హత్యలు, అత్యాచారాలు, అపహరణలు వంటి తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేయడం జరిగింది. 2025లో మొత్తం 14 హత్య కేసులు నమోదయ్యాయి.

ప్రాపర్టీ కేసులు(దొంగతనాలు):

2025లో 517 ప్రాపర్టీ కేసులు నమోదు కాగా, వాటిలో 149 కేసులు చేధించి రూ. ?89,09,510/ విలువైన ఆస్తి రికవరీ చేయడం జరిగింది. రికవరీ శాతం(35.20%). %ూజ/ూ% కేసులు:మొత్తం 22 కేసులు నమోదయ్యాయి.

ఇసుక అక్రమ రవాణా:

71 కేసులు నమోదు చేసి,వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.గేమింగ్ యాక్ట్: 299 కేసులు నమోదు చేసి, ?8,87,925/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్:

మొత్తం 7908 కేసులు నమోదు చేయగా, ముగ్గురికి జైలు శిక్షలు విధించబడ్డాయి.

రోడ్డు ప్రమాదాలు:

2025లో 660 మంది రోడ్డు ప్రమాదాల కు గురయ్యారు. ప్రమాదాలు నివారించేందుకు రోడ్ల పై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ:

ఈ కార్యక్రమంలో భాగంగా 2025లో ఇప్పటివరకు ఎలాంటి గంజాయి కేసులు నమోదు కాలేదు. మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం జరిగింది.

డయల్-100:

డయల్-100 కాల్ ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంనుండైనా నేర సమాచారం అందుకున్న 5 నిమిషాల వ్యవధిలో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించడం జరిగింది.ఈ సంవత్సరంలో మొత్తం 22,327 డయల్ 100 కాల్స్ స్వీకరించి, తక్షణ చర్యలు చేపట్టాం.

ఆపరేషన్ స్మైల్ %డ% ముస్కాన్%-శ×:

2025 సంవత్సరంలో జనవరి, జూలై నెలల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్%డ% ముస్కాన్%-శ×% కార్యక్రమాలు నిర్వహించి, 123 మంది పిల్లలను రక్షించి, వారి కుటుంబాలకు అవగాహన కల్పించడం జరిగింది.

గ్రామ పంచాయతీ ఎన్నికలు%-2025:

2025 సంవత్సరంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను మూడు దశల్లో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంతో ప్రశాంతంగా ముగించడం జరిగింది.ఎన్నికల నియమావళి ఉల్లంఘనలో భాగంగా 69 మద్యం అక్రమ రవాణాపై కేసులు నమోదు చేసి 1027 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగింది. అంతేకాకుండా అక్రమ నగదు తరలింపుపై 13 కేసులు నమోదు చేసి రూ.12,93,700 స్వాధీనం చేసుకొని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై 3 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం జరిగింది.ఎన్నికల కాలంలో మొత్తంగా 201 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం జరిగింది.

సంచలనాత్మక కేసులు:

భైంసా పోలీస్ స్టేషన్ పరిధిలోని గత ఏడాది కాలంగా మీ సేవా సెంటర్‌లో జోరుగా సాగిన ఆన్లైన్ బెట్టింగ్ వ్యాపారానికి చెక్ పెట్టి సుమారుగా కోటిన్నర విలువ గల ఆస్తుల స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేయడం జరిగింది.అదేవిధంగా మత్తు ఇంజెక్షన్లతో గోవులను కబళించిన గ్యాంగ్‌కి చెక్ పెట్టి అంతరాష్ట్ర ముఠా ను అరెస్టు చేయడం జరిగింది.

సైబర్ నేరాలు:

2025లో 52 సైబర్ క్రైమ్ కేసులు నమోదు అయ్యాయని, వాటిలో 30 లక్షలకు పైగా నగదు బాధితులకు తిరిగి అందించామని తెలిపారు.

CEIR ద్వారా మొబైల్ ఫోన్ల రికవరీ: 1806 పోయిన మొబైల్ ఫోన్లు గుర్తించి, లి?2.16 కోట్ల విలువైన ఫోన్లు బాదితులకు అందించామని తెలిపారు.

బందోబస్తు:

VIP/VVIP పర్యటనలతో పాటు, గణేష్ నవరాత్రులు, రంజాన్,వంటి అన్ని పండుగలు, జాతరల బందోబస్తు కార్యక్రమాలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

సిసి కెమారాలు:

2025 సంవత్సరంలో ప్రజల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 909 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, జియో-ట్యాగింగ్ చేసి,వాటిని

జిల్లా కమాండ్ & కంట్రోల్ సెంటర్ కి అనుసంధానం చేయడం జరిగింది.

గ్రీవెన్స్ డే :

ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడానికి గ్రీవెన్స్ డే,శ్రీకారం చుట్టి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి చట్ట ప్రకారం న్యాయం చేయడం జరిగింది. భైంసా సబ్ డివిజన్ నుండి ప్రజలు నిర్మల్ రావడం ఇబ్బంది అవుతుంది అనే ఆలోచనతో, ప్రతీ బుధవారం భైంసా క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుంది.

కమ్యూనిటీ పోలీసింగ్:

ఈ కార్యక్రమం లో భాగంగా నిరుపేద ఆదివాసీ బిడ్డలకు రేషన్ సరఫరా, యువతను వేరే చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడల వైపు మళ్లించేందుకు వారికి వాలీబాల్ కిట్లను పంపిణీ చేయటం జరిగింది.

యాంటీ%-%ర్యాగింగ్ కార్యక్రమం:

విద్యాసంస్థల్లో సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు యాంటీ%-% ర్యాగింగ్ చట్టాలు, విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ర్యాగింగ్ నివారణపై విద్యార్థులను చైతన్యపరచడం జరిగింది.

పోలీస్ అమర వీరుల వారోత్సవాల సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 350 పై చిలుకు మంది పోలీసులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

2026 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, స్నేహపూర్వక పోలీసు విధానాన్ని అవలంబిస్తూ, జిల్లా పోలీస్ శాఖ బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో, పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజల రక్షణ కోసం అనుక్షణం పనిచేస్తామని తెలుపుతూ జిల్లా ప్రజలకు మా యొక్క నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీన, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్,ఇన్స్పెక్టర్ లు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో గడువు ముగిసిన మందుల అక్రమ నిర్వాహణ

## డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్‌కు సమాచారం ఇచ్చినా స్పందన కరువు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 30 (భారత శక్తి): నిర్మల్ జిల్లా కేంద్రంలో కొంతమంది ప్రైవేటు మెడికల్ షాపుల యజమానులు, ఔషధ ఏజెన్సీలు గడువు ముగిసిన మందులు, గోలీలు, సిరపులను జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డుపక్కనే నిర్లక్ష్యంగా పారవేయడంతో పాటు కొన్ని చోట్ల కాల్చివేయడం జరుగుతుండటంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విధంగా గడువు ముగిసిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పడవేయడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, వీధి జంతువులకు తీవ్ర ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందులను కాల్చే సమయంలో విడుదలయ్యే విషవాయువులు గాలిని కాలుష్యం చేసి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

కావాలని నిర్లక్ష్యమా? అవగాహన లోపమా?

ఈ విషయంలో మెడికల్ షాపుల యజమానులు చట్టాలు, నిబంధనలు తెలిసినా కూడా కావాలని ఈ విధంగా వ్యవహరిస్తున్నారా? లేక బయో%-%మెడికల్ వేస్ట్ నిర్వాహణపై అవగాహన లేకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతి పొందిన బయో%-%మెడికల్ వేస్ట్ నిర్వాహణ ఏజెన్సీల సేవలను వినియోగించకుండా, ఖర్చు తగ్గించుకునేందుకు బహిరంగంగా మందులను పారవేయడం, కాల్చడం జరుగుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చినా స్పందన లేదన్న ఆరోపణ

ఈ అక్రమ నిర్వాహణ వ్యవహారం జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఫోన్ ద్వారా సమాచారం అందించిన సమయంలో “నేను ప్రస్తుతం అందుబాటులో లేను” అని సమాధానం ఇచ్చారని, ఆ తరువాత కూడా ఎలాంటి తనిఖీలు లేదా చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన ప్రజారోగ్య సమస్యపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

చట్టాల ప్రకారం నేరం

గడువు ముగిసిన మందులను ఈ విధంగా బహిరంగంగా పారవేయడం, దహనం చేయడం పలు చట్టాలకు విరుద్ధమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్%-1940,

%డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్%-%1945 ప్రకారం గడువు ముగిసిన లేదా నాణ్యత లేని మందులను శాస్త్రీయ పద్ధతిలో, అనుమతి పొందిన విధానంలోనే నిర్వాహణ చేయాలి. ఉల్లంఘనకు జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.



బయో%-%మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్%-%2016 ప్రకారం మందులు, వైద్య వ్యర్థాలను అనుమతి పొందిన బయో%-%మెడికల్ వేస్ట్ నిర్వాహణ సంస్థల ద్వారానే తొలగించాలి. బహిరంగంగా పారవేయడం లేదా కాల్చడం చట్టరీత్యా నేరం.

పర్యావరణ పరిరక్షణ చట్టం%-%1986 ప్రకారం గాలి, నీటి కాలుష్యానికి కారణమయ్యే చర్యలు శిక్షార్హమైన నేరాలు.

భారతీయ శిక్షాస్మృతి (%×ూజ%) సెక్షన్ 268 (పబ్లిక్ న్యూసెన్స్) ప్రకారం ప్రజలకు ప్రమాదం కలిగించే చర్యలు నేరంగా పరిగణించబడతాయి.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఈ వ్యవహారంపై నిర్మల్ మున్సిపాలిటీ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, మున్సిపల్ హెల్త్ అధికారులు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా గడువు ముగిసిన మందులను నిర్వాహణ చేస్తున్న మెడికల్ షాపులు, ఔషధ ఏజెన్సీలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మెడికల్ షాపులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సుల రద్దు వరకు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





# వాట్సప్‌లో 'కొత్త' ఫీచర్లు..
# 2026 స్టిక్కర్స్, వీడియో కాల్‌లో ఎఫెక్ట్స్!

కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ వాట్సప్ పలు కొత్త ఫీచర్లు తీసుకొచ్చింది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలను మరింత ఆనందంగా జరుపుకొనేందుకు వీటిని తెస్తున్నట్లు తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. 2026 స్టిక్కర్ ప్యాక్‌తో పాటు వీడియో కాల్స్‌లో ఎఫెక్ట్స్ వంటి ఫీచర్లను తెస్తున్నట్లు తెలిపింది. సాధారణ రోజుల్లో తమ వేదిక ద్వారా 100 బిలియన్ సందేశాలు, 2 బిలియన్ కాల్స్ జరుగుతాయని వాట్సప్ పేర్కొంది. న్యూఇయర్ రోజు మాత్రం ఈ విషయంలో ఏటా సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయని, ఈసారి కూడా సరికొత్త రికార్డులు నమోదు కావొచ్చని అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త ఫీచర్లను జోడిస్తున్నామని, ఆ రోజంతా ఈ ఫీచర్లు అందుబాటులో ఉంటాయని వాట్సప్ పేర్కొంది.

**కొత్త ఫీచర్లు ఇవే..**

* కొత్త ఏడాది సందర్భంగా వాట్సప్‌లో 2026 స్టిక్కర్ ప్యాక్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. మీ బంధువులు, స్నేహితులకు న్యూఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఈ స్టిక్కర్లు ఉపయోగపడతాయి. వీటిని వ్యక్తిగత, గ్రూప్ చాట్‌లలో వినియోగించొచ్చు.
* వీడియో కాల్‌లో కొత్త ఎఫెక్ట్‌లను వాట్సప్ తీసుకొస్తోంది. కొత్త ఏడాదిలో వీడియో కాల్ సమయంలో ఆన్ స్క్రీన్‌పై ఫైర్‌వర్క్స్, కన్ఫెట్టి (రంగుల కాగితం ముక్కలు), స్టార్స్ వంటి ఎఫెక్ట్స్‌ను జోడించొచ్చు.




* ఏదైనా సందేశానికి కన్ఫెట్టి ఎమోజీ జోడించినప్పుడు ఒక ప్రత్యేక యానిమేషన్ దర్శనమిస్తుంది.
* స్టేటస్ విభాగంలోనూ తొలిసారి యానిమేటెడ్ స్టిక్కర్లను జోడిస్తున్నట్లు వాట్సప్ తెలిపింది. కాంటాక్టులో ఉన్న వ్యక్తులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేలా ఈ స్టిక్కర్లను వినియోగించొచ్చని పేర్కొంది.
* నూతన సంవత్సరం వేడుకల వేళ ఈవెంట్లను మరింత పకడ్బందీగా ప్లాన్ చేసుకోవడానికి ఈవెంట్ ప్లాన్, పోల్స్, లైవ్ లొకేషన్, వాయిస్/వీడియో నోట్స్‌ను ఉపయోగించుకోవాలని యూజర్లకు సూచించింది.

## మళ్లీ పెరిగిన వెండి ధర..
# కేజీ రూ.2.39 లక్షలకు






మదుపర్ల లాభాల స్వీకరణతో రికార్డు ధరల నుంచి సోమవారం భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు మంగళవారం జోరందుకున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కేజీ వెండి ధర మళ్లీ రూ.2.30 లక్షల స్థాయిని దాటగా.. 10 గ్రాముల పసిడి ధర 1.38 లక్షల పైనే పలికింది.

* కమోడిటీ ఎక్స్ఛేంజీల్లో వెండి మార్చి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సోమవారం రూ.2,24,855 (ఒక కిలోకి) వద్ద స్థిరపడింది. ఈ ధర మంగళవారం 4 శాతానికి పైగా పెరిగి రూ.2.34 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది.
* హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేటి ఉదయం 11.45 గంటల ప్రాంతంలో కేజీ వెండి ధర రూ.2.39 లక్షలుగా ఉంది. సోమవారం ఈ ధర రూ.2.28 లక్షల వరకు పతనమైంది.
* ఇక, పసిడి 2026 ఫిబ్రవరి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సోమవారం రూ.1,34,887 (10 గ్రాములకు) వద్ద ముగియగా.. నేడు 0.61శాతం పెరిగి రూ.1.35 లక్షలుగా ఉంది.
* హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.38 లక్షలు పలికింది. క్రితం రోజు ధర (రూ.1.37లక్షలు)తో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.

అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయనే అంచనాలు, వెండిపై చైనా ఎగుమతి ఆంక్షల నేపథ్యంలో మదుపర్లు నిన్న లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో ధరల్లో గణనీయమైన దిద్దుబాటు కన్పించింది. ఈ క్రమంలోనే కనిష్ఠాల వద్ద నేడు మళ్లీ కొనుగోళ్లు ఊపందుకోవడంతో ఈ లోహాల ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు.



# 2025లో మదుపర్ల సంపద రూ.30 లక్షల కోట్లు పైకి

దిల్లీ: విదేశీ మదుపర్ల అమ్మకాలు, టారిఫ్‌ల ఒత్తిడులు, రూపాయి పతనం వంటి ప్రతికూలతల నడుమ దలాల్ స్ట్రీట్ మదుపర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ 8 శాతం పెరిగి మదుపర్లకు రూ.30.20 లక్షల కోట్ల ప్రతిఫలాన్ని అందించింది. దేశీయ స్థూల ఆర్థిక పరిస్థితులు, దేశీయ మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో ఇది సాధ్యమైందని అనలిస్టులు పేర్కొంటున్నారు. 2025లో డిసెంబర్ 29 వరకు బీఎస్ఈ సెన్సెక్స్ 8.39 శాతం వృద్ధితో 6,556.53 పాయింట్లు పెరిగింది. డిసెంబర్ 1న అత్యధికంగా 86,159.02 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ రికార్డు గరిష్ఠాలను అందుకుంది. డిసెంబర్ 29 వరకు బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.30 లక్షల కోట్లు (రూ.30,20,376.68) పెరిగి రూ.472 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారి బీఈఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.400 లక్షల కోట్ల మార్కును చేరుకుంది. 2024లో సెన్సెక్స్ 8.16 శాతం వృద్ధితో 5,898.75 పాయింట్లు పెరిగింది.



ఆ ఏడాది బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.77.66 లక్షల కోట్లు వృద్ధి చెందింది. 2023లో బీఈఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.81.90 లక్షల కోట్లు వృద్ధి నమోదైంది. 2025లో దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి సుమారు రూ.1.6 లక్షల కోట్లను విదేశీ మదుపర్లు తరలించారు. అయినప్పటికీ దేశీయ మదుపర్ల మద్దతు, స్థిరమైన వృద్ధి, ప్రభుత్వ మూలధన వ్యయం వంటివి మన మార్కెట్‌ను నిలబెట్టాయని స్టాక్స్‌కార్ట్ సీఈఓ ప్రణయ్ అగర్వాల్ పేర్కొన్నారు. దీనికితోడు టాటా క్యాపిటల్ (రూ.15,512 కోట్లు), హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ.12,500 కోట్లు), ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా (రూ.11,607కోట్లు), హెక్సావేర్ టెక్నాలజీస్ (రూ.8,750కోట్లు), లెన్స్‌కార్ట్ (రూ.7,278 కోట్లు), గ్రో (రూ.6632 కోట్లు) వంటి ఐపీఓలు కూడా మార్కెట్స్ పెరగడానికి దోహదం చేశాయి. దీర్ఘకాలంలో మన మార్కెట్లు మెరుగైన ప్రతిఫలం ఇస్తుందన్న అంచనాలతో సిప్ ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. దీంతో రిటైల్ మదుపర్ల భాగస్వామ్యం కూడా తోడైంది.

**రిలయన్స్‌దే టాప్**

2025లో అత్యధిక మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో రిలయన్స్ అగ్రస్థానంలో నిలిచింది. రూ.20,91,173 కోట్ల మార్కెట్ విలువ దీని సొంతం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.15,25,457.75కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.11,86,978.75 కోట్లు), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (రూ.11,77,199.05కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.9,60,478.36 కోట్లు) టాప్ 5 స్థానాల్లో నిలిచాయి.

# అతడే.. బౌలర్ ఆఫ్ ది ఇయర్

**: రవిచంద్రన్ అశ్విన్**


టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన దృష్టిలో బౌలర్ ఆఫ్ ది ఇయర్ ఎవరో చెప్పేశాడు. ఈ విషయంలో వరుణ్ చక్రవర్తికే అతడు ఓటు వేశాడు. తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అశ్విన్ ఈ మేరకు విశ్లేషించాడు. 'నా దృష్టిలో వరుణ్ చక్రవర్తి టీమ్ఇండియాకు బౌలర్ ఆఫ్ ది ఇయర్. అతడు జట్టుకు ఒక ఎక్స్ ఫ్యాక్టర్. టీమ్ఇండియా టీ20 వరల్డ్‌కప్ 2026 సాధించడంలో వరుణ్ కీలకపాత్ర పోషించబోతున్నాడు. ముఖ్యంగా అతడు టీ20 స్పెషలిస్ట్ బౌలర్' అని అశ్విన్ అన్నాడు. వరుణ్ చక్రవర్తి ఒకానొక దశలో జట్టుకు దూరమై.. తిరిగి బలంగా తిరిగొచ్చిన అంశాన్నీ అశ్విన్ ప్రస్తావించాడు. 'అతడు జట్టులో చోటు కోల్పోయినప్పుడు పుంజుకొని కమ్ బ్యాక్ ఇచ్చాడు. ప్రస్తుతం అతడు టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్నాడు. నిజానికి అతడో ఆర్కిటెక్ట్. క్రికెట్ అతడి మొదటి ప్రొఫెషన్ కాదు. అతడు



మొదట చెన్నైలో అయిదో డివిజన్‌లో బౌలింగ్ చేశాడు. తర్వాత నెట్ బౌలర్‌గా వచ్చాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అద్భుతంగా బంతులు సంధించాడు' అని అతడి క్రికెట్ ప్రయాణాన్ని అశ్విన్ గుర్తు చేశాడు. అలాగే టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మను కూడా అశ్విన్ కొనియాడాడు. '2025లో అభిషేక్ శర్మ బ్యాట్‌తో అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో చక్కగా పరుగులు రాబట్టాడు. అతన్ని వన్డే ఫార్మాట్‌లో కూడా చూడాలని ఉంది. రెడ్‌బాల్ క్రికెట్‌లోనూ అతన్ని పరీక్షించొచ్చు. అతడు ఈ సంవత్సరానికి సంబంధించి అత్యుత్తమ బ్యాటర్' అని అశ్విన్ కితాబిచ్చాడు. అలాగే రోకో జోడీ గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'వారు రానున్న వన్డే వరల్డ్‌కప్ గెలవాలన్న ఆశయంతో ఉన్నారు. దాన్ని సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. వారి ఆటను మనమంతా ఆస్వాదిస్తున్నాం' అని పేర్కొన్నాడు. వరుణ్ చక్రవర్తి ఇప్పటివరకు ఆడిన నాలుగు వన్డేల్లో 10, 20 టీ20ల్లో 36 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక.. అభిషేక్ శర్మ 2025లో 21 టీ20 మ్యాచుల్లో 42.95 యావరేజ్, 193.46 స్ట్రైక్ రేట్‌తో 859 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలున్నాయి.

# అతడు టెస్ట్‌లు ఆడతానంటే.. బీసీసీఐ వద్దంటుందా?

హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్‌పై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప కీలక వ్యాఖ్యలు చేశాడు. అతడికి టెస్ట్ జట్టులో పునరాగమనం చేసే సత్తా ఉందని అభిప్రాయపడ్డాడు. ఒకవేళ అదే జరిగితే ఆ ఆల్‌రౌండర్‌కు నం.7వ స్థానం సరిగ్గా సరిపోతుందన్నాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యకు ఉన్న ఫిట్‌నెస్.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను సరిగా నిర్వహిస్తే, టెస్ట్ క్రికెట్ ఆడేందుకు సరిపోతుందని ఉతప్ప తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అభిప్రాయపడ్డాడు. "ఒకవేళ హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్‌లో పునరాగమనం చేస్తే.. నం.7వ స్థానం అద్భుతంగా సరిపోతుంది. ప్రస్తుతం అతడు ఆడుతున్న విధానాన్ని చూస్తే.. ఏదైనా జరగొచ్చు అనిపిస్తోంది. ఎందుకంటే ఇది క్రికెట్. హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్ ఆడాలని నిశ్చయించుకుంటే.. బీసీసీఐ అతడికి అడ్డు చెబుతుందా? 'నేను ఆడతాను.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను సాధిస్తాను' అని అతడు అంటే బీసీసీఐ నో చెబుతుందనైతే నేను అనుకోను' అని రాబిన్ ఉతప్ప విశ్లేషించాడు. అలాగే ప్రస్తుతం టీమ్ఇండియాలో టెస్ట్ క్రికెట్‌లో ఆల్‌రౌండర్ల మీద అంత ఒత్తిడి లేదని ఉతప్ప అన్నాడు. 'ఆల్ రౌండర్లు 20 ఓవర్లు బౌలింగ్ చేస్తున్నారా? నితీశ్‌కుమార్ రెడ్డి అయితే అన్ని ఓవర్లు బౌలింగ్ చేయడం లేదు. అతడు దాదాపు 12 ఓవర్ల వరకు బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతమున్న ఫిట్‌నెస్ ప్రకారం చూసుకుంటే హార్దిక్ పాండ్య ఒక ఇన్నింగ్స్‌లో 12 నుంచి 15 ఓవర్లపాటు బౌలింగ్ వేయగలడు. అయితే ఈ విషయమై అతడే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని రాబిన్ ఉతప్ప అన్నాడు. హార్దిక్ పాండ్య చివరిసారిగా 2018లో టెస్ట్, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. వెన్నుముక గాయం తర్వాత



అతడు రెడ్ బాల్ క్రికెట్‌కు దూరమయ్యాడు. అప్పటినుంచి పాండ్య కేవలం వైట్ బాల్ క్రికెట్ మీదే తన దృష్టి పెట్టాడు.




# 2025.. విశ్వవిజేతలుగా మన మహిళామణులు!

2025 సంవత్సరం భారత మహిళల క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుంది. 47 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ హర్మన్ సేన విశ్వవిజేతగా నిలిచింది. వన్డే వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకుంది. 1978 నుంచి భారత మహిళల జట్టు చేస్తున్న ప్రయత్నం చివరికి ఈ ఏడాది ఫలించింది. 2005లో మిథాలీ సారథ్యంలో ఫైనల్‌కు చేరినా ఓటమి తప్పలేదు. 2017లోనూ మిథాలీ సేనకు కప్పు చిక్కినట్లే చిక్కి చేజారింది. కానీ హర్మన్ సేన ఈసారి ఒడిసి పట్టుకుంది. దశాబ్దాల నాటి టీమ్ఇండియా కలను సాకారం చేసుకుంది. స్వదేశంలో జరిగిన ఈ మెగా టోర్నీలో తొలుత వరుస పరాజయాలతో తడబడినా.. పడిలేచిన కెరటంలా తిరిగి పుంజుకుంది. ముఖ్యంగా సెమీస్‌లో కంగారూలపై అద్భుత విజయం సొంతం చేసుకుంది. అనంతరం ఫైనల్‌లో సఫారీలపై పైచేయి సాధించి, కలల కప్పును కళ్లకద్దుకుంది!

**ఇది సమష్టి విజయం**

ఫైనల్‌లో టీమ్ఇండియా టాస్ ఓడింది. మొదట బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. మొదటి వికెట్‌కు రికార్డ్ స్థాయిలో శతక భాగస్వామ్యం నమోదైంది. 27 ఓవర్లకు స్కోరు 162/1. దీంతో టీమ్ఇండియా 350 పరుగులు చేస్తుందని అభిమానులు, క్రికెట్ విశ్లేషకులు భావించారు. కానీ అనూహ్యంగా టీమ్ఇండియా 298 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో అంతటా




ఉత్కంఠ నెలకొంది. మూడోసారి కూడా కప్పు అందకుండా పోతుందా.. అని అభిమానుల్లో కాస్త అలజడి మొదలైంది. కానీ భారత బౌలర్లు విజృంభించి దక్షిణాఫ్రికాను 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌట్ చేశారు. ఫైనల్‌లో 52 పరుగులతో విజయం సాధించారు. ప్రతీక రావల్ గాయపడటంతో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన షెఫాలీ వర్మ ఫైనల్‌లో అటు బ్యాట్‌తోనూ (87; 78 బంతుల్లో, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇటు బంతితోనూ (36/2) రాణించింది. దీప్తిశర్మ 5 వికెట్ల ప్రదర్శన చేసింది. బ్యాటింగ్‌లోనూ (58; 58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరిసింది. ఓపెనర్ స్మృతి మంధాన (45) చక్కటి ఆరంభాన్ని అందించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ సరైన సమయంలో షెఫాలీ చేతికి బంతిని అందించి వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. అలా ఆటగాళ్ల సమష్టి కృషితో టీమ్ఇండియా విజయం సాధించింది.

**అదే ఊపుతో..**

వన్డే వరల్డ్ కప్ సొంతం చేసుకున్న ఊపులో టీమ్ఇండియా శ్రీలంకతో టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేస్తోంది. అయిదు మ్యాచులకు గానూ వరుసగా నాలుగింట్లో విజయకేతనం ఎగురవేసింది. మరికొన్ని గంటల్లో (మంగళవారం రాత్రి 7.00) అయిదో టీ20 ప్రారంభం కానుంది. ఈ ఆఖరు మ్యాచ్‌లోనూ విజయం సాధించి, సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని, అలాగే 2025 సంవత్సరాన్ని గెలుపుతో ముగించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# భక్తులతో కిటకిటలాడిన గడ్డి అన్నవరం వీర వెంకట సత్యనారాయణ దేవస్థానం

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం నుండి గడ్డి అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడిందని, చైర్మన్ దేవరం లింగారెడ్డి, కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు.ఉదయం 5 గంటల నుండి పూజా కార్యక్రమాలతో తిరుప్పావై పట్టణము అనంతరము దర్శనాలు అర్చనలు ప్రారంభమయ్యాయని వైకుంఠ ఏకాదశి సందర్భంగా గడ్డి అన్నవర క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాట్లు చేసారు, గరుడ ద్వారం, శేషద్వారం, వృషభ ద్వారం, అంజనా ద్వారాలను, వెంకట ద్వారం, నారాయణ ద్వారం, పరమపద వైకుంఠ ద్వారాన్ని గోదా రంగనాథుల దర్శనం సత్యనారాయణ స్వామి వారికి గంధంతో అలంకరణ, స్వామి దర్శనం అనేక మంది భక్తులు చేసుకున్నారని, ఈ పూజా కార్యక్రమంలో దేవరం లింగారెడ్డి, వక్కలంక శ్రీనివాసరావు, భాషపాక సంతోష్, బచ్చు సత్య నారాయణ, ప్రోద్దుటూరి కుమారస్వామి పూజలు నిర్వహించారు.వైకుంఠ ద్వారా



దర్శనానికి గడ్డియన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర రెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రవీణ్, భారాస నాయకుడు గండి సన్నీ, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, వసంత్ మనోహర్, ట్రస్ట్ సభ్యులు మార్గం రమేష్, కంకర పిచ్చిరెడ్డి భక్తులు అధికంగా పాల్గొన్నారు. ఉత్తర ద్వారాలను, అనంత పద్మనాభం, వెంకటేశ్వర స్వామి, బాలరాముడు, వినాయకుడి విగ్రహాల దగ్గర ఫోటోలు, సెల్ఫీలు భక్తులు తీసుకున్నారు. గడ్డి అన్నవర క్షేత్రం చాలా బాగా అలంకరణ చేసారని భక్తులు తెలిపారు.



## అక్రమ మద్యం రవాణాపై
# ఆబ్కారీ శాఖ ఉక్కుపాదం

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి): ఇతర రాష్ట్రాల నుండి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు తీసుకు వస్తే కఠినచర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్, సరూర్ నగర్ ఎక్సైజ్ అధికారి ఎన్. శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమీషనర్ ప్రోహిబిషన్ ఎక్సైజ్, ఆదేశాల మేరకు ఎన్ఫోర్సెమెంట్ ఏఇఎస్ జీవన్ కిరణ్ అధ్వర్యంలో పహాడిషరీఫ్ వద్ద ఎయిర్ పోర్ట్ నుండి వచ్చే వాహనాల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీలో 229 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు గోవా, ఢిల్లీ రాష్ట్రాల నుండి తెచ్చినవి స్వాధీనం చేసుకుని 12 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## రోడ్లనే మింగేస్తున్నారు..
# హైడ్రా 'ప్రజావాణి'లో వెల్లువెత్తిన ఫిర్యాదులు

హైదరాబాద్, డిసెంబర్ 29 (భారత శక్తి) : నగరంలో ఆక్రమణదారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఇంటి ముందు ఖాళీ స్థలమే కాకుండా, ఏకంగా రోడ్లను కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారు. ముఖ్యంగా డెడ్ ఎండ్ రోడ్లను పూర్తిగా ఆక్రమించి, ఇతరులకు కనీసం నడిచే దారి కూడా లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ఉల్లంఘనలపై నిఘా ఉంచాల్సిన వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన 'హైడ్రా ప్రజావాణి'లో ఇటువంటి ఆక్రమణలపై భారీగా ఫిర్యాదులు అందాయి. మొత్తం 44 ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



**ప్రధాన ఫిర్యాదులు ఇవే..**

* రోడ్డును ఫెన్సింగ్‌తో చుట్టేశారు: వనస్థలీపురం సాహెబ్ నగర్‌లోని శ్రీ వీరాంజనేయ కాలనీలో 18 అడుగుల రహదారిని కొందరు ప్లాట్ల యజమానులు కబ్జా చేశారు. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను సైతం కలుపుకొని ఫెన్సింగ్ వేసినా, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని నివాసితులు ఫిర్యాదు చేశారు.
* ప్రభుత్వ భూమి కబ్జా.. ఇళ్లకు దారి బంద్: కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో (సర్వే నం. 202) ఒక రియల్ ఎస్టేట్ సంస్థ 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా, స్థానికుల ఇళ్లకు వెళ్లే దారిని మూసివేసిందని బాధితులు మొరపెట్టుకున్నారు.
* 30 అడుగుల రోడ్డు.. 7 అడుగులకు కుదింపు: అల్వాల్ మచ్చబొల్లారంలోని సూర్యనగర్ బస్సు స్టాప్ వద్ద 30 అడుగుల రోడ్డును 7 అడుగుల వరకు ఆక్రమించేశారు. దీనివల్ల బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని బాలాజీ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
* దశాబ్దాల నాటి బాటల మూసివేత: మహేశ్వరం మండలం శ్రీనగర్ గ్రామంలో (సర్వే నం. 248, 249) దశాబ్దాలుగా వాడుకలో ఉన్న కచ్చా రోడ్డును కొందరు వ్యక్తులు బ్లాక్ చేశారని స్థానికులు తెలిపారు.
* అపార్ట్‌మెంట్ దారుల ఆక్రమణ: రాజేంద్రనగర్ ఉప్పరపల్లిలోని పీఎంఆర్ అపార్ట్‌మెంట్ సమీపంలో రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనివల్ల వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.
* చెరువులో లేఅవుట్ ప్లాట్లు: మహేశ్వరం మండలం సర్దార్ నగర్‌లో హెచ్ఎండీఏ అనుమతితో వేసిన లేఅవుట్‌లోని ప్లాట్లు రావిర్యాల చెరువులో మునిగిపోతున్నాయని, వెంటనే చెరువు ఎఫ్‌టీఎల్ (FTL) నిర్ధారించి తమ ప్లాట్లు కాపాడాలని బాధితులు విన్నవించారు.



# ఎన్టీఆర్ నగర్ డివిజన్ పై
## తీవ్ర అభ్యంతరం తెలుపుతున్న స్థానికులు

* **నియోజకవర్గ పరిధి మార్చి వార్డ్ సృష్టించటంపై అభ్యంతరం**

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి): జిహెచ్ఎంసి వార్డుల పునర్విభజన భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి లింగోజిగూడ డివిజన్, కొత్తపేట డివిజన్లను మహేశ్వరం అసెంబ్లీలోని ఎన్టీఆర్ నగర్ డివిజన్ గా మార్చడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎల్బీనగర్ గ్రామ స్థానికులు అఖిల పక్షంగా ఏర్పడి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, ఆడాల రమేష్, జానీమియా, గుండె కిరణ్ కుమార్, అల్లి భాస్కర్ యాదవ్, జీవన్ రెడ్డి, చంద్రశేఖర్ గణేష్ గౌడ్, జగదీష్, సతీష్, పోలే ప్రదీప్, బాలకృష్ణ రాజు, కిట్టు, భానుచందర్, నాని గౌడ్, భరత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు



## కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా
# చుంచు బాల్ రెడ్డి నియామకం

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది చుంచు బాల్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. భారత కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవృత్తిలో ఆయనకు ఉన్న అపారమైన అనుభవం, చట్టపరమైన అంశాలపై ఉన్న పట్టును గుర్తించి ప్రభుత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది.

**అంకితభావానికి నిదర్శనం:**

న్యాయవాదిగా గత కొన్నేళ్లుగా అనేక చిక్కుముడులతో కూడిన కేసులను పరిష్కరించడంలో బాల్ రెడ్డి విశేషమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, న్యాయసూత్రాలకు కట్టుబడి ఆయన అందిస్తున్న సేవలు ఈ పదవికి ఆయన్ను వరించడానికి కారణమయ్యాయి.

**బాధ్యతాయుతంగా పనిచేస్తా: బాల్ రెడ్డి**

తన నియామకంపై చుంచు బాల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన కేంద్ర ప్రభుత్వ పెద్దలకు, సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే:**

* "కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసుల్లో న్యాయపరమైన పక్షాన్ని సమర్థవంతంగా వినిపిస్తూ, ప్రభుత్వానికి, న్యాయస్థానానికి మధ్య వారధిగా పనిచేస్తాను."
* "రాజ్యాంగబద్ధమైన విలువలని కాపాడుతూ, బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాను."
* "సామాన్య ప్రజలకు న్యాయం చేకూరేలా నా వంతు కృషిని కొనసాగిస్తాను."

* **హర్షం వ్యక్తం చేస్తున్న అనుచరులు, న్యాయవాదులు:**

బాల్ రెడ్డి అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులు కావడంపై ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖులు, తోటి న్యాయవాదులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పదవీ బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

**ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలోని కోదండరామ ఉపాలయం నందు ఉత్తర ద్వార దర్శనంలో పాల్గొన్నారు.ఆలయ పాలకమండలి,అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్,కవిత, మధు సాగర్, ముద్ద కళ్యాణ్, యాదిరెడ్డి, సతీష్ గౌడ్,సురేందర్ రెడ్డి,రవి ముదిరాజ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.**

**ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి ):**



# వెంకేపల్లి గ్రామం అభివృద్ధి కోసం కృషి చేయాలి

* **ఎంపీ చామల.కిరణ్ కుమార్ రెడ్డిని కలిసిన ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీనివాస్**

హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి): హైదరాబాద్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ పరిధిలోని వెంకేపల్లి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఎంపీతో చర్చించారు.గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, దళిత వాడల్లోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని, నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి కొమ్ము శ్రీనివాస్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



# చైనీస్ మాంజాతో మరో ప్రమాదం

* **యువకుడి మెడకు తీవ్ర గాయం.. కానిస్టేబుల్ స్పందించి వెంటనే ఆసుపత్రికి తరలింపు...**

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి) : హైదరాబాద్ నగరంలో నిషేధించబడిన చైనీస్ మాంజా మరోసారి ప్రాణాపాయ పరిస్థితిని సృష్టించింది. బుధవారం సాయంత్రం గడ్డిఅన్నారం పరిధిలోని శివ గంగా థియేటర్ రోడ్ సమీపంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ఓ యువకుడి మెడకు గాజు పూత ఉన్న చైనా మాంజా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.గాయపడిన యువకుడిని అశోక్ గా గుర్తించారు. అకస్మాత్తుగా మెడకు పదునైన మాంజా తగలడంతో రక్తస్రావం జరిగింది. ఈ ఘటన చోటు చేసుకున్న సమయంలో అక్కడే విధుల్లో ఉన్న మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం.క్రాంతి వెంటనే స్పందించి, ప్రథమ చికిత్స చేసి యువకుడిని దిల్‌సుఖ్‌నగర్‌లోని కమల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం ప్రస్తుతం అశోక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.ఈ ఘటన నగరంలో చైనీస్ మాంజా వినియోగం ఎంత ప్రమాదకరమో మరోసారి స్పష్టం చేసింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇలాంటి మాంజా కారణంగా తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిషేధం ఉన్నప్పటికీ, అక్రమంగా మాంజా విక్రయం, వినియోగం కొనసాగుతుండటంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు చట్టాన్ని



గౌరవించి నిషేధిత మాంజాను ఉపయోగించకూడదని, ఎవరైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతోనే ఇలాంటి ప్రమాదాలను నివారించగలమని పోలీసులు తెలిపారు.

# చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా

హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి):చారిత్రక దుర్గం చెరువును కబ్జాదారులు ఎలా కబళించారో కళ్లకు కట్టే సాక్ష్యాలను హైడ్రా బయటపెట్టింది. ఒకప్పుడు 160 ఎకరాల విస్తీర్ణంతో అలరారిన ఈ చెరువు, నేడు 116 ఎకరాలకు ఎలా కుంచించుకుపోయిందో వివరిస్తూ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' సహకారంతో శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. దశాబ్దాలుగా సాగిన ఈ ఆక్రమణల పర్వాన్ని ఈ చిత్రాలు స్పష్టంగా బట్టబయలు చేస్తున్నాయి. గోల్కొండ కోట నివాసులకు దాహార్తిని తీర్చిన ఈ 'సీక్రెట్ లేక్'.. నేడు కబ్జాల చెరలో చిక్కుకుంది. హైడ్రా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 1976 నాటికే దుర్గం చెరువులో 29 ఎకరాలు కబ్జాకు గురై 131.66 ఎకరాలకు తగ్గింది. ఆ తర్వాత 1995 వరకు సురక్షితంగా ఉన్నప్పటికీ, 1995 నుంచి 2000 మధ్య మరో 10 ఎకరాలు అన్యాక్రాంతమై 121 ఎకరాలకు పడిపోయింది. 2000 సంవత్సరం నుంచి నేటి వరకు మరో 5 ఎకరాలు కబ్జా కోరల్లోకి వెళ్లినట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దాదాపు 5 ఎకరాల మేర జరిగిన ఆక్రమణలను హైడ్రా మంగళవారం విజయవంతంగా తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కబ్జాలను నిర్ధారించుకున్నారు. అక్కడ 10 నుంచి 15 మీటర్ల మేర మట్టిని చెరువులో డంప్ చేసి, ఆ స్థలాన్ని చదును చేసి భారీ పార్కింగ్ దందాను నడిపిస్తున్నారు. స్కూల్ బస్సులు, ఐటీ ఉద్యోగుల క్యాబ్‌ల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వాడుతూ, నెలకు దాదాపు రూ.50 లక్షల




వరకు అద్దెలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందని, ఆక్రమిత స్థలం తనదేనంటూ సదరు ప్రజాప్రతినిధి క్లైమ్ చేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి భూ రికార్డులు లేకుండానే ఏళ్ల తరబడి ఈ దందా సాగుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణలు అడ్డుగా మారాయి. మంగళవారం జరిగిన ఆపరేషన్‌లో హైడ్రా అధికారులు పార్కింగ్‌లోని వాహనాలను ఖాళీ చేయించి, ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. త్వరలోనే డంప్ చేసిన మట్టిని కూడా తొలగించి చెరువు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు పూర్తి విస్తీర్ణాన్ని పక్కాగా తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది.

## అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఖరారు

హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి):తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరపున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు. అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

ఢిల్లీ, డిసెంబర్ 30 (భారత శక్తి):గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్‌వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్‌కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (InvIT) ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య...

బంగ్లాదేశ్, డిసెంబర్ 30: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకటి తర్వాత ఒకటిగా హింసాత్మక ఘటనలు వెలుగులోకి వస్తుండటంతో అక్కడి పరిస్థితులపై అంతర్జాతీయంగా కూడా చర్చ మొదలైంది. దీపు చంద్ర దాస్, అమృత్ మండల్ హత్యల తర్వాత తాజాగా మరో హిందూ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మైమన్‌సింగ్ జిల్లాలో పనిచేస్తున్న 42 ఏళ్ల బజేంద్ర బిశ్వాస్‌ను అదే ఫ్యాక్టరీలో పని చేసే యువకుడు కాల్చి చంపిన ఘటన కలకలం రేపుతోంది. భాలుకా ఉపజిల్లాలోని లాబిబ్ గ్రూప్‌కు చెందిన సుల్తానా స్వెటర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ దారుణం చోటుచేసుకుంది. బజేంద్ర బిశ్వాస్ అక్కడ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండగా, నిందితుడిగా గుర్తించిన 22 ఏళ్ల నోమన్ మియాన్ కూడా అదే యూనిట్‌లో భద్రతా విధుల్లో ఉన్నాడు. బంగ్లాదేశ్ హోం మంత్రిత్వ శాఖ ఆధీనంలోని 'అన్సార్' విభాగంలో ఇద్దరూ పని చేస్తున్నారు. సంఘటన సమయంలో ఇద్దరూ మాట్లాడుకుంటుండగా, నోమన్ తన వద్ద ఉన్న ప్రభుత్వ తుపాకీని సరదాగా బజేంద్ర వైపు గురిపెట్టి అకస్మాత్తుగా కాల్చాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో బజేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అనుకోకుండా జరిగిందా? లేక వెనుక మరేదైనా ఉద్దేశం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఈ హత్యను సాధారణ ఘటనగా తీసుకోలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జిల్లాలో ఇటీవల దీపు చంద్ర దాస్ అనే హిందూ యువకుడిని 'దైవదూషణ' ఆరోపణలతో మతోన్మాద మూక అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. అతడిని హత్య చేసి, నగ్నంగా శరీరాన్ని చెట్టుకు కట్టేసి తగలబెట్టిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ తర్వాత రాజ్‌బరి జిల్లాలో అమృత్ మండల్ అనే మరో హిందూ వ్యక్తిని గ్రామస్తులు మూకగా దాడి చేసి చంపిన ఘటన మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ వరుస హత్యలతో బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై పెద్ద ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్కడి ప్రభుత్వం పరిస్థితిని ఎలా అదుపులోకి తీసుకుంటుందో, ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

## వైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాలు

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వైష్ణవ ఆలయాలు వైకుంఠ ఏకాదశి శోభతో వెలిగిపోతున్నాయి. భక్తులు వేకువజామున 2 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలకు తరలివచ్చారు. తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. మొదట వీఐపీలకు వైకుంఠ ద్వారం గుండా శ్రీవారి దర్శనం కల్పించగా, సాధారణ భక్తులకు ఉదయం 6 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వేకువజామునే శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రే తిరుమలకు చేరుకున్న ముఖ్యమంత్రి కుటుంబానికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి సీఎం కుటుంబానికి తీర్థప్రసాదాలు అందజేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల గిరులు, ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి.

## చిల్లర చేష్టలకు చోటు లేదు.. చట్టమే శిక్ష!

* **నూతన సంవత్సర వేడుకల్లో అశాంతి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**
* **డిసెంబర్ 31 సాయంత్రం నుండి సరూర్ నగర్ లో కట్టుదిట్టమైన పోలీసు నిఘా**
* **రాష్ డ్రైవింగ్, మద్యం మత్తులో హంగామా చేస్తే వాహనాల సీజ్ – సీఐ హెచ్చరిక**

ఎల్బీనగర్, డిసెంబర్ 30 (భారత శక్తి): నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని సరూర్ నగర్ సీఐ వి. సైదిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. న్యూ ఇయర్ వేడుకల పేరిట యువత అతి చేష్టలకు పాల్పడితే ఎలాంటి ఉపేక్ష ఉండదని, చిల్లర చేతలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం



చేశారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి సరూర్ నగర్ లో కీలక ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి రోడ్లపై డ్యాన్సులు చేయడం, ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా న్యూసెన్స్ సృష్టించడం, వీధుల్లో కేకులు కట్ చేయడం వంటి చర్యలను పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు.అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యం సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే సైలెన్సర్ తీసిన బైకులు,రాష్ డ్రైవింగ్‌కు పాల్పడే వాహనాలను తక్షణమే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అనవసరంగా రోడ్లపై తిరగరాదని, పోలీసు ఆంక్షలను ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వి. సైదిరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సరం వేడుకలు ప్రజలందరూ ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## తిరుమల తరహాలో గుట్ట ఆలయంలో ప్రత్యేక సేవలు

యాదగిరి గుట్ట, డిసెంబర్ 30 (భారత శక్తి): తెలంగాణలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఆర్జిత సేవలను ప్రారంభించేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సేవలలో కొన్నిటిని వైకుంఠ ఏకాదశి నుంచి, మిగతా వాటిని ఫిబ్రవరి నెల నుంచి దశలవారీగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న సేవల్లో భాగంగా ముందుగా తోమాల సేవను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సేవ ప్రతి బుధవారం ఉదయం 6.15 నుంచి 6.45 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతులు కలిసి పాల్గొనే ఈ సేవకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. భక్తులు స్వామివారికి తోమాల సమర్పించి ప్రత్యేక ఆశీర్వాదాలు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న విధానానికి భిన్నంగా తులాభారం సేవను సరికొత్తగా రూపొందించారు. ఈ సేవలో అవసరమైన నాణేలు, బెల్లం వంటి వస్తువులను ఆలయ అధికారులు స్వయంగా అందుబాటులో ఉంచనున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తులాభారం నిర్వహించుకునే అవకాశం కలగనుంది. వైకుంఠ ఏకాదశి తర్వాత ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించనున్నారు. ఈ సేవకు టికెట్ ధర రూ.500గా నిర్ణయించగా, ఇందులో పాల్గొన్న భక్తులకు రెండు లడ్డూ ప్రసాదాలను ఉచితంగా అందజేయనున్నారు. ఇక ఇప్పటివరకు రథసప్తమి రోజుకే పరిమితమైన సూర్యప్రభ వాహన సేవను ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 7.00 నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతుల కోసం ఈ సేవ టికెట్ ధరను రూ.1,000గా నిర్ణయించారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు ఒక శాలువా, కనుమను ప్రసాదంగా అందజేస్తారు. అలాగే ఆలయ చరిత్రలో తొలిసారిగా చంద్రప్రభ వాహన సేవను కూడా ప్రారంభించనున్నారు.

## ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్ బాబు భాధ్యత స్వీకరణ

ఫ్యూచర్ సిటీ, డిసెంబర్ 30 (భారత శక్తి): నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా మంగళవారం సాయంత్రం సుధీర్ బాబు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయనను పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నేను ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ఇటీవల గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించుకోవడం జరిగినదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేయడం జరిగిందని,రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తామని అన్నారు. అన్నీ శాఖల సమన్వయంతో పని చేస్తామని,



ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో 22 పోలీసు స్టేషన్లు పని చేస్తాయని, ఈ పోలీసు స్టేషన్ల అధికారులతో కలిసి టీమ్ వర్క్ తో సమర్థవంతంగా పని చేస్తామని అన్నారు. నాకు ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## గగనతలంపై సుదర్శన చక్రం..శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

ఢిల్లీ, డిసెంబర్ 30 (భారత శక్తి):దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ 89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర - ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు.

# వేల కోట్ల రోడ్ల బడ్జెట్ ఏమైపోతోంది..?

- కాంగ్రెస్ పాలనలో గుంతలు రాజ్యం ఏలుతున్నాయి..
- సి ఆర్ ఎం పీ పేరుతో దోపిడీ జరుగుతోంది..
- హైదరాబాద్ రోడ్లు కాంగ్రెస్ వైఫల్యానికి సాక్ష్యం..
- ఇవి రోడ్లు కాదు, మరణపు ఉచ్చులు..
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం.. !
- హైదరాబాద్ సైబర్ సిటీ కాదు.. ఇప్పుడు గుంతల నగరం.
- వేల కోట్ల రూపాయల రోడ్ల బడ్జెట్ ఉన్నా అభివృద్ధి సున్నా..
- రోడ్లు కనిపించడం లేదు.. గుంతలే కనిపిస్తున్నాయి..
- అభివృద్ధి లోపం కాదు.. పాలన వైఫల్యం కాదు.
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం..
- హైదరాబాద్ రోడ్ల దుస్థితిపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..





(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి ) :** సి ఆర్ ఎం పీ అంటే సిటీ రోడ్ మెయింటనెన్స్ పేరుతో వేల కోట్ల నిధులు విడుదలయ్యాయి. అయితే ఫలితం ఏమిటి? ప్రధాన రహదారులపై అకస్మాత్తుగా ఏర్పడిన భారీ గుంతలు.. వర్షం పడితే కనిపించని మరణపు ఉచ్చులు.. బైక్ సవారీదారుల దుర్మరణాలు..

ఆటో, కార్లు తలకిందులయ్యే పరిస్థితులు.. అంబులెన్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రాణాలు పోతున్న దృశ్యాలు//

ఇదేనా కాంగ్రెస్ చెప్పిన "ప్రజా పాలన"?

**నగరం మొత్తం గుంతల సమాధి :**

రోడ్లే ప్రజలకు సమాధులవుతున్నాయా? మియాపూర్ నుంచి మల్కాజ్‌గిరి వరకు, లకడీకాపూల్ నుంచి లింగంపల్లి వరకు, జూబ్లీహిల్స్ నుంచి చార్మినార్ వరకు, ఎక్కడ చూసినా ఒకే దృశ్యం... గుంతలు, మట్టి, ధూళి, ప్రమాదాలు. రోడ్లు వేస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు. రోడ్లు పగిలితే ప్రజలకు ప్రమాదాలు. ఇది అభివృద్ధి మోడలా? లేదా దోపిడీ మోడలా?

**వేల కోట్ల బడ్జెట్... పని మాత్రం శూన్యం! :**

ప్రభుత్వ లెక్కల ప్రకారం హైదరాబాద్ రోడ



అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు కేటాయించారు. అయితే ఆ డబ్బు ఎక్కడికి పోయింది?

ఎవరి జేబుల్లోకి వెళ్లింది? పనులు ఎందుకు నాణ్యత లేకుండా ఉన్నాయి? నెలకోసారి అదే రోడ్డు ఎందుకు తవ్వుతున్నారు? "రోడ్లు వేస్తున్నారా? లేక బిల్లులు రాస్తున్నారా?"

కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది... భద్రత మాత్రం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కానీ ప్రజల భద్రత మాత్రం రోడ్లపై కనిపించడం లేదు. ప్రతిరోజూ: రోడ్డు ప్రమాదాలు.. నడిచేవారికి గాయాలు.. వృద్ధులు, పిల్లలు రోడ్డుపై పడిపోతున్న దారుణ దృశ్యాలు


ఇవి సహజమా? లేదా పాలకుల నిర్లక్ష్య ఫలితమా? ఇది పరిపాలన కాదు... నిర్లక్ష్యానికి పరాకాష్ట.. ఇది అభివృద్ధి కాదు... ప్రజల ప్రాణాలతో చెలగాటం. ఎన్నికలప్పుడు రోడ్లు గుర్తొస్తాయి... అధికారంలోకి వచ్చాక గుంతలే గుర్తొస్తాయి. ఇది రాజకీయ విమర్శ కాదు. ఇది ప్రజల జీవన హక్కుపై జరుగుతున్న దాడి.

**రోడ్డు నిర్మాణంలో అవినీతి :**

నాణ్యత లోపం .. ప్రమాదాలు.. మరణాలు. ఈ పాపంలో బాధ్యత ఎవరిది? మంత్రి? మేయర్? కమిషనర్? లేక మొత్తం ప్రభుత్వం?

ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు..? ఎప్పుడు చెబుతారు ? గుంతలపై ఎప్పుడు శాశ్వత పరిష్కారం? అవినీతిపై ఎప్పుడు విచారణ? బాధ్యులపై ఎప్పుడు చర్య? లేకపోతే చరిత్రలో ఈ ప్రభుత్వం ఇలా గుర్తుండిపోతుంది: వేల కోట్ల బడ్జెట్... గుంతల రాజ్యం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి చిరునామాగా నిలిచిపోతుంది..

## గ్రూప్ 1 పై జనవరి 22న హైకోర్టు తీర్పు



హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి): తెలంగాణ గ్రూప్ 1 సెలక్షన్ లిస్టుపై జనవరి 22న తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించనుంది. ఈ ఏడాది మార్చి 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంగింక్స్ లిస్ట్, మార్కుల జాబితాలో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా ఈ జాబితాను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీల్ కు వెళ్లింది. దీంతో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ స్టే విధించింది. ఈ అంశంలో ఇరు పక్షాల వాదనలు విన్న డివిజన్ బెంచ్ జనవరి 22వ తేదీన తీర్పు వెలువరించనుంది.

## అంతర్జాతీయ పర్యాటకులపై ఫోకస్..
## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి): తెలంగాణ పర్యాటక రంగం దేశానికే దిక్సూచిగా మారాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించేలా వినూత్న మార్పులు తీసుకురావాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం తారామతి బరాదరిలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టీజీటీడీసీ రూపొందించిన 'టేబుల్ క్యాలెండర్' 2026 ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎండీ క్రాంతి వల్లూరు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, ఆర్కియాలజీ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రావు, తదితరులు పాల్గొని, పర్యాటక అభివృద్ధిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


*** ప్రపంచం తెలంగాణ వైపు చూసేలా ప్రణాళికలు**

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారింది. పర్యాటక రంగంలో మనం కొత్తగా ఏవో అద్భుతాలు సృష్టించాల్సిన అవసరం లేదు. మనకు ప్రకృతి ప్రసాదించిన వనరులు, వారసత్వ సంపద పుష్కలంగా ఉన్నాయి. వాటికి మెరుగులు దిద్ది, సరైన పద్ధతిలో ప్రపంచానికి పరిచయం చేస్తే చాలు. దేశ, విదేశీ పర్యాటకులు సైతం తెలంగాణ వైపు చూసేలా మన ప్రణాళికలు ఉండాలి" అని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతాలను నగరవాసులకు, రాష్ట్ర విశిష్టతలను దేశ, అంతర్జాతీయ పర్యాటకులకు చేరువ చేయడమే మన లక్ష్యం కావాలి" అని స్పష్టం చేశారు. పర్యాటకులకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు గిరిజన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆచారాలను పరిచయం చేయాలి. అదేవిధంగా ప్రకృతితో మమేకమై ఎక్కడో కొండకోనల్లో జీవిస్తున్న ఆదివాసీలు, గిరిజనులకు నగరంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ఆకాశహర్మ్యాలు, మెట్రో రైళ్లు నగరవాసుల ఆధునిక జీవన శైలిని తెలియజేసే విధంగా కార్యచరణ రూపొందించాలని అన్నారు.

**కేరళ లాంటి రాష్ట్రాలతో పోటీ పడాలి**

పర్యాటక ప్రదేశాలకు కేవలం వచ్చి వెళ్లడం కాకుండా, పర్యాటకులు అక్కడ కనీసం రెండు రోజులు బస చేసేలా ఆకర్షణీయమైన వాతావరణాన్ని సృష్టించాలి. కనీస వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. కేవలం సందర్శన మాత్రమే కాదు.. వసతి, భోజనం, రవాణా వంటి మౌలిక సదుపాయాల్లో నాణ్యత పెరగాలి. ఐటీ కారిడార్లు, భారీ మాల్స్, విద్యాసంస్థల్లో మన పర్యాటక ప్రచార చిత్రాలు పర్యాటకులను ఆకర్శించేలా ఉండాలి. సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలు, వినూత్న స్కిట్స్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకోవాలి. హాస్పిటాలిటీలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలి, కేరళ లాంటి రాష్ట్రాలతో మనం పోటీ పడాలి. ఆ దిశగా కార్యచరణ ఉండాలి" అని దిశానిర్దేశం చేశారు. భాషా సమస్యలు, నైపుణ్యం కలిగిన గైడ్ల కొరతను అధిగమించాలని సూచించారు.

## తెలంగాణ జర్నలిస్టుల
## అక్రిడిటేషన్లపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు



హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రెడిటేషన్ల గడువును ప్రభుత్వం మరోసారి పెంచింది. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఉత్తర్వులు జారీ చేశారు. రేపటితో ముగియనున్న అక్రెడిటేషన్ కార్డుల కాల పరిమితిని 2026 ఫిబ్రవరి 28 వరకు పొడిగించారు. తెలంగాణలో గత రెండేళ్లుగా కొత్తగా అక్రెడిడేషన్ కార్డులను మంజూరు చేయలేదు. గత 22 నెలలుగా అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని ప్రతి మూడు నెలలకు ఒకసారి పొడిగిస్తూనే ఉంది. ఈ సారి గడువు పొడిగించడం ఇది ఏడోసారి కావడం గమనార్హం.

**అందుకోసమే గడువు పెంపు?:**

జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ల మంజూరు అంశం చాలా కాలంగా పెండింగ్‌లోనే ఉంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కార్డుల పరిమితిని పలు సార్లు పొడిగిస్తూనే ఉంది. ఈ క్రమంలో కొత్త అక్రిడిటేషన్ల కోసం ఈ నెల 22వ తేదీన ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ఈ మేరకు జీవో నంబర్ 252 (GO No 252) ను రిలీజ్ చేసింది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో అక్రిడిటేషన్ కమిటీలను కమిటీలు ఏర్పాటు చేసి ఆ తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొంది. అయితే ఈ జీవోలో రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇస్తామని ప్రకటించడం పట్ల జర్నలిస్టుల సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ క్రమంలో పలు జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నాయి. జర్నలిస్టుల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో డెస్క్ జర్నలిస్టులకు నష్టం కలిగించే అంశాలను జీవో నెం.252లో సవరిస్తామని తనను కలిసిన జర్నలిస్టు సంఘంతో తాజాగా సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం స్పష్టం చేశారు. అయితే ఈ జీవో విషయంలో వివాదం చెలరేగడంతోనే ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుకు బదులు పాత కార్డులను మరో రెండు నెలల పాటు పొడిగించిందా అనే చర్చ జరుగుతోంది.

## రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ
## ముదిరాజ్‌ల జెండా ఎగరాలి: ఈటల

హైదరాబాద్, డిసెంబర్ 30 (భారత శక్తి): రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ముదిరాజ్‌ల జెండా ఎగరాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన ముదిరాజ్ సర్పంచ్, ఉప సర్పంచ్‌లను ఇవాళ రవీంద్రభారతిలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్, మంత్రి వాకిటి శ్రీహరి, కాసాని జ్ఞానేశ్వర్, బండ ప్రకాష్ సహా పలువురు ముదిరాజ్ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడిన ఈటల రాజేందర్.. పార్లమెంట్ సభ్యులు గెలవడం కంటే వార్డు సభ్యులు, సర్పంచ్ గెలవడం కష్టం అని సేవ ఎంత చేసినా ఎన్నికల్లో డబ్బుల ప్రవాహం ఉండడం దుర్మార్గమైన విషయం అన్నారు. ఆ డబ్బుల ప్రవాహాన్ని తొక్కి పడేసి గెలిసి వచ్చిన మీ అందరికీ శుభాకాంక్షలు.. అవకాశం అందరికీ రాదు. వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవద్దని సూచించారు. మా వాడిని గెలిపిస్తే గొప్పగా పనిచేశారు అనే పేరు రావాలన్నారు. మంత్రి శ్రీహరి ఉన్నారు నేను కూడా మీకు అండగా ఉంటాను. ఏ సమస్య వచ్చినా తీర్చడానికి అందుబాటులో ఉంటామమని



భరోసా ఇచ్చారు. ఇన్నాళ్లు బతుకుతెరువు కోసం పోరాడాం కానీ రాజకీయాల మీద మనకి యావలేదు. ఇప్పుడిప్పుడే ఆ తెలివి వస్తుంది. ప్రతి ఇంట్లో చదువుకున్న వారు ఉన్నారు. కేవలం సంఖ్య మాత్రమే సరిపోదు.. వ్యూహం కార్యాచరణ లౌక్యం కూడా కావాలన్నారు. ఇంకా ఎన్నాళ్లు వెనకబడి ఉందాం? ఎందుకు యాచించే స్థాయిలో ఉండాలి? రోశం, చైతన్యం, జనాభా ఉన్న జాతి మనది. అన్ని ఉన్నా కూడా దేహి అనే పరిస్థితిలో ఉండకూడదు అనే మీ ఆలోచన విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. మనం వేరే వారిని ద్వేషించవద్దు వ్యతిరేకించవద్దు. ఇంతమంది జనాభా ఉన్న ఎందుకు అడుక్కోవాలి అనేది ఇప్పుడు ప్రశ్న అన్నారు.

*** బీసీ-ఏ మార్పు కోసం ఉమ్మడిగా పోరాడుదాం:**

తెలంగాణలో 4 వేల సొసైటీలు మనకు ఉన్నాయి. పెద్ద గ్రామాల్లో ఉన్న చెరువుల మీద హక్కులు లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. తాళ్లు ఎక్కే వాళ్లవే తాటిచెట్లు, చేపలు పట్టే వాళ్ళవే చెరువులు. చెరువులు మీద హక్కులు కావాల్సిందేనన్నారు. చెరువుల సొసైటీలో సభ్యత్వం కోసం ఇప్పుడున్న జీవోను రద్దుచేసి కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. బ్రోకర్ల వ్యవస్థ పూర్తిగా లేకుండా చేయాలి. ఉచిత చేప పిల్లలు, ఐస్ బాక్సులు, ఐస్ ఫ్యాక్టరీలు, టీవీఎస్ మోపెళ్ళు, ట్రాన్స్పోర్ట్ కి అవసరమైన డీసీఎంలు.. ఇవన్నీ రావడానికి అప్పుడు నేనే కృషి చేశానన్నారు. పెద్ద ప్రాజెక్టులలో కూడా జోన్లు ఏర్పాటు చేసి చేపలు పట్టుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు. బీసీడీ నుంచి బీసీఏ లోకి మార్చాలనేది సమంజసమైన డిమాండ్ దానికోసం అందరం కలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. సాహసానికి మారు పేరు మన జాతి అని గ్రామాలలో అందరినీ కలుపుకొని లీడ్ చేయాలని సూచించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.